
పెండింగ్ డీఏలను విడుదల చేయాలి



సమావేశమైన రిటైర్డ్ ఫారెస్ట్ ఎంప్లాయిస్ నాయకులు

కరీంనగర్ క్రైం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలను తక్షణమే విడుదల చేయాలని రిటైర్డ్ ఫారెస్ట్ గెజిటెడ్ అధికారుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. రిటైర్డ్ ఎంప్లాయిస్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రిటైర్డ్ ఫారెస్ట్ గెజిటెడ్ అధికారుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం నగరంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో వరంగల్, కరీంనగర్ ఫారెస్ట్ సర్కిల్ అధికారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా రిటైర్డ్ ఫారెస్ట్ ఉద్యోగులకు ఉచిత వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. అంతకు ముందు ఇటీవల మరణించిన మర్రి భీమయ్య, రాజేశ్వరరావుకు శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం నూతనంగా పదవీ విరమణ పొందిన సభ్యులను సత్కరించారు. రిటైర్డ్ ఫారెస్ట్ ఉన్నతాధికారులు శ్రీనివాస్, దాసరి నాగభూషణం, నర్సయ్య, మాజీ ఎమ్మెల్యే, సీనియర్ సిటిజన్స్ రాష్ట్ర అధ్యక్షుడు ఉచ్చిడి మోహన్‌రెడ్డి, రిటైర్డ్ ఫారెస్ట్ గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షుడు పురుషోత్తం, ప్రధాన కార్యదర్శి మహేందర్ రాజు, ముఖ్య సలహాదారు కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తొలి విడతలో ముగ్గురు ఏకగ్రీవం



- నేటి నుంచి మొదలుకానున్న ప్రచారం
- వార్డు సభ్యులుగా ఎన్నికైన 270 మంది
- సర్పంచు బరిలో 387 మంది, వార్డుల్లో 1581 మంది
- రెండవ విడత నామినేషన్ల పరిశీలన పూర్తి
- మూడవ విడత నామినేషన్ల స్వీకరణ ప్రారంభం
- తొలిరోజు సర్పంచు పదవులకు 118, వార్డులకు 257 నామినేషన్లు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

పంచాయతీ ఎన్నికల తొలి విడతలో ముగ్గురు మహిళలు ఏకగ్రీవంగా సర్పంచులుగా ఎన్నికయ్యారు. మొదటివిడుత ఎన్నికలు జరుగుతున్న 92 పంచాయతీల్లో మూడు పంచాయతీల సర్పంచు పదవులు ఏకగ్రీవమయ్యాయి. మిగతా 89 పంచాయతీల సర్పంచు పదవులకు 387 మంది పోటీలో ఉన్నారు. అలాగే ఆయా పంచాయతీల్లోని 866 వార్డు సభ్యుల పదవులకు 270 మంది ఏకగ్రీవంగా ఎన్నిక కాగా మిగతా వార్డులకు 1581 మంది పోటీలో ఉన్నారు. బుధవారం తొలి విడత ఎన్నికలు జరుగుతున్న పంచాయతీల్లో నామినేషన్ల ఉపసంహరణ తర్వాత చొప్పదండి మండలం పెద్దకురుమపల్లి గ్రామ సర్పంచు పదవి జనరల్ మహిళకు రిజర్వుకాగా మావురం సుగుణ (ఇండిపెండెంట్) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే రామడుగు మండలం శ్రీరాములపల్లి సర్పంచు పదవి జనరల్ మహిళకు రిజర్వు కాగా ఒంటెల సుగుణమ్మ (బీఆర్ఎస్)ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సింగిల్ నామినేషన్ రావడంతో చొప్పదండి మండలానికి చెందిన దేశాయిపేట గ్రామ సర్పంచుగా వడ్లకొండ తిరుమల (ఇండిపెండెంట్) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గంగాధర మండలంలో 33 పంచాయతీలకు ఎన్నికలు జరుగుతుండగా సర్పంచు స్థానాలకు 138 మంది బరిలో ఉన్నారు. 296 వార్డులకు 102 వార్డుల్లో ఎన్నిక ఏకగ్రీవం అయింది. మిగిలిన 194 వార్డులకు 583 మంది పోటీ పడుతున్నారు. చొప్పదండి మండలంలో 16 గ్రామపంచాయతీల్లో దేశాయిపేట, పెద్దకురుమపల్లి పంచాయతీల్లో సర్పంచులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మిగతా 14 సర్పంచు పదవులకు 68 మంది పోటీపడుతున్నారు. ఈ మండలంలోని 154 వార్డులకు 53 వార్డుల్లో సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నిక

మండలం	ఏకగ్రీవం సర్పంచు	వార్డులు
కొత్తపల్లి	లేవు	08
కరీంనగర్ రూరల్	లేవు	26
గంగాధర	లేవు	102
చొప్పదండి	02	53
రామడుగు	01	81
మొత్తం	03	270

(మిగతా 8వ పేజీలో)

భవిత కేంద్రాల అభివృద్ధికి చర్యలు

- కలెక్టర్ పమేలా సత్పతి



మహాత్మానగర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో పాఠాలు చదివిపిస్తున్న జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

తిమ్మాపూర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో దివ్య దృష్టి కార్యక్రమం ద్వారా ప్రభుత్వ అంధుల, బధిరుల పాఠశాల, భవిత కేంద్రాలను అభివృద్ధి చేస్తున్నామని కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. బుధవారం మండలంలోని మహాత్మానగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నూతనంగా నిర్మించిన భవిత కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు.భవిత కేంద్రాల్లో ప్రత్యేక పద్ధతిలో విద్యా బోధనతో దివ్యాంగ విద్యార్థుల్లో ఎంతో మార్పు కనిపిస్తోందని అన్నారు. చిన్న వయసులోనే భవిత కేంద్రంలో చేర్పిస్తే ప్రత్యేక అవసరాలు గల పిల్లలు తల్లిదండ్రుల అవసరం లేకుండానే సొంతంగా వారి పనులు చేసుకునే స్థాయికి చేరుకుం టారని అన్నారు. భవిత కేంద్రాల్లో పనిచేస్తున్న ప్రత్యేక విద్య బోధించే ఉపాధ్యాయుల సేవలు అభినందనీయం అని కొనియడారు. అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ దివ్యాంగుల పాఠశాలలు, భ విత కేంద్రాల్లో అన్ని రకాల సదుపాయాలను కల్పించామన్నారు. ఈ కార్య క్రమంలో జిల్లా విద్యాధికారి శ్రీరాం మొండయ్య, తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి, ఎంపీడీవో రాజీవ్ మల్హోత్ర, విద్యాశాఖ కోఆర్డినేటర్ మిల్కూరి శ్రీనివాస్, ఎం ఈవో శ్రీనివాస్, డీఈ కృష్ణ కుమార్, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ పాల్గొన్నారు.

బుధవారం బోధనలో ప్రతి విద్యార్థి పాల్గొనాలి

మహాత్మానగర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం బోధన కార్యక్రమాన్ని కలెక్టర్ పమేలా సత్పతి పరిశీలించారు. విద్యార్థులతో పాఠాలు చదివించారు. కొందరు విద్యా ర్థులు పాఠాలు సరిగ్గా చదవకపోవడంతో కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. 10వ తరగతి పరీక్షలు దగ్గర పడుతున్నందున విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. బుధవారం బోధనలో ప్రతి విద్యార్థిని భాగస్వామ్యం చేయాలని అన్నారు. విద్యార్థులు పట్టుద లతో నేర్చుకోవాలని సూచించారు.

ప్రజల స్థితిగతులపై పిరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే

హుజూరాబాద్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణ ప్రజల జీవన స్థితిగతులపై గణాంక శాఖ ఆధ్వర్యంలో బుధవారం పిరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా గణాంక శాఖాధికారి గుర్రం శ్రీనివాస్ మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎంపిక చేసిన పట్టణాల్లో హుజూరాబాద్ ఉందని, పట్టణాలు, గ్రామాల్లో ఉపాధి స్థితిగతులపై సర్వే చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, మేనేజర్ భూపాల్‌రెడ్డి, టౌన్ ప్లానింగ్ అధికారి అశ్వినిగాంధీ, తహసీల్దార్ నరేందర్, ఎంపీఎస్వో జ్యోతి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బధిరుల పాఠశాలల్లో ఇంటర్ తరగతులు..



దివ్యాంగులను అభినందిస్తున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

- మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్
- రేకుర్తి బధిరుల ఆశ్రమ పాఠశాలలో దివ్యాంగుల దినోత్సవం

రేకుర్తిలోని బధిరుల ఆశ్రమ పాఠశాలలో మహి ళలు, పిల్లలు, వికలాంగు లు, వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్స వం నిర్వహించారు. కార్యక్రమానికి ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ దివ్యాంగుల వయోవృద్ధుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ హాజరై మాట్లా డారు. మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ అనితా రామ చంద్రన్, వయోవృద్ధుల దివ్యాంగుల సంక్షే మ శాఖ డైరెక్టర్ శైలజ తదిత రులు పాల్గొన్నారు.

7

పంచాయతీ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

- రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణికుముదిని



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ పమేలా సత్పతి, పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం

కరీంనగర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి, ప్రతినిధి): గ్రామపంచాయతీ ఎన్నికలను పక డ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణికుముదిని అన్నారు. మంగళ వా రం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ఎన్నికల కమి షనర్ రాణికుముదిని జిల్లాల కలెక్టర్లు, ఎన్నికల పరిశీల కులు, పోలీసు అధికారులతో ఎన్నికల నిర్వహణపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల కమిషనర్ మాట్లాడుతూ మొదటి, రెండవ విడత నామి నేషన్ల స్వీకరణ, దాఖలైన నామినేషన్ల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. రెండవ విడత నామినేషన్ల పరిశీలన ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలని, మూడవ విడత నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ కూడా తప్పి దాలకు తావు లేకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఎన్నికల సిబ్బంది కేటాయింపు, పోస్టల్ బ్యాలెట్, బ్యాలెట్ బాక్సులు, శాంతిభద్రతలు తదితర అంశాలపై సమీక్షించారు. ఈ కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ మొదటి విడతలో 92 సర్పంచ్ స్థానాలకు 730 నామి నేషన్లు, 866 వార్డు సభ్యుల స్థానాలకు 2,174 నామినేషన్లు దాఖల య్యాయని చెప్పారు. రెండో విడతలో 113 సర్పంచ్ స్థానాలకు 888 నామినేషన్లు, 1,046 వార్డు సభ్యుల స్థానాలకు 3,056 నామినేషన్లు దాఖలయ్యాయని వెల్లడించారు. 2,946 పోలింగ్ కేంద్రాలలో కనీస వసతులు కల్పించామని కలెక్టర్ తెలిపారు.

జిల్లాలో మొదటి, రెండవ విడత నామినేషన్ల స్వీకరణ ప్రక్రియలు విజయవంతంగా నిర్వహించామన్నారు. మొదటి విడత నామినేషన్ల పరిశీలన కూడా నిబంధనలకు అనుగు ణంగా నిర్వహించినట్లు తెలిపారు. ఎన్నికలను స్వేచ్ఛాయుత వాతావరణంలో పారదర్శకంగా నిర్వ హించేందుకు జిల్లా, మండలస్థాయిలో అధికారులతో పర్యవేక్షిస్తు న్నామని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్‌తో పాటు పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, ఎన్నికల పరిశీలకులు వెంకటేశ్వర్లు, డీఆర్‌ఓ వెంకటేశ్వర్లు, జిల్లా పంచా యతీ అధికారి జగదీశ్వర్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రత

- 635 మంది పాతనేరస్థుల బైండోవర్
- 33 లైసెన్స్‌డ్ ఆయుధాల డిపాజిట్
- పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం

కరీంనగర్ క్రైం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మూడు విడతల్లో జరిగే గ్రామ పంచాయతీ ఎన్నికలకు పోలీస్ యంత్రాంగం సంసిద్ధంగా ఉందని పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం తెలిపారు. బుధవారం రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో సీపీ మాట్లాడుతూ తుది డ్రాఫ్ట్ బందోబస్తు ప్రణాళిక సిద్ధం చేసినట్లు చెప్పారు. గతంలో జరిగిన ఘటనల ఆధారంగా మొత్తం పోలింగ్ కేంద్రాలను సాధారణ, సమస్యాత్మక కేంద్రా లుగా విభజించినట్లు తెలిపారు. మొత్తం కేంద్రా లలో 19 శాతం సమస్యాత్మకమైనవిగా గుర్తిం చి, వాటి వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే గత ఎన్నికల నేరస్థులు, రౌడీషీటర్లు, భౌతిక దాడులకు పాల్పడిన 635 మందిని బైండోవర్ చేసినట్లు సీపీ తెలిపారు. ఇప్పటివరకు 70 అక్రమ మద్యం కేసులు,1 ఎన్‌డీపీఎస్ చట్టం కేసు నమోదు చేశామన్నారు. 33 లైసెన్స్‌డ్ తుపాకులను డిపాజిట్ చేసుకున్నామని, మిగిలిన వాటిని కూడా పూర్తి స్థాయిలో డిపాజిట్ చేసుకుం టామని సీపీ తెలిపారు. గ్రామాలను క్లస్టర్‌గా విభజించి నిరంతర గస్తీ నిర్వహిస్తున్నామని సీపీ పేర్కొన్నారు. గ్రామ పోలీసు అధికారులను కేటాయించి, క్షేత్రస్థాయిలో పోలీసు బలోపేతం చేసి, ప్రజలకు ఎన్నికలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సీపీ తెలిపారు. స్టేషన్ హౌస్ అధికారులు కూడా గ్రామాల్లో తిరుగుతూ ఎన్నికల నియమావళిపైఅవగాహన కల్పిస్తున్నారని వివరించారు.

నల్లా కనెక్షన్ల కోసం ప్రత్యేక కౌంటర్

- నాణ్యతతో అభివృద్ధి పనులు పూర్తి చేయాలి
- మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్‌దేశాయ్



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్‌దేశాయ్

కరీంనగర్ టౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): నగరంలో చేపడుతున్న నల్లా కనెక్షన్ల ఇంటింటి సర్వే కార్యక్రమంతో ప్రజల్లో అనేక సందేహాలు, అనుమానాలు వ్యక్తమవుతున్నందున వాటిని నివృత్తి చేసేందుకు నగరపాలక సంస్థ కార్యాలయ ఆవరణలోని పౌరసేవ సెంటర్‌లో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్‌దేశాయ్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన మున్సిపల్ సమావేశమందిరంలో ఇంజనీరింగ్ అధికారులతో స్మార్ట్‌సిటీ, వివిధ గ్రాంట్లు, నిధులతో నగరంలో చేపడుతున్న అభివృద్ధి పనులు, నల్లా కనెక్షన్ల సర్వేపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నల్లా కనెక్షన్ల సర్వేతో అనేక ఫిర్యాదులు వస్తున్నందున ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసి వారి సందేహాలు, సమస్యలను పరిష్కరించాలని సూచించారు. అలాగే సర్వే ప్రక్రియను కూడా త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. డీఈ స్థాయి అధికారి నోడల్ ఆఫీసర్‌గా వ్యవహరించాలన్నారు. అలాగే స్మార్ట్‌సిటీ, వివిధ గ్రాంట్లతో నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతి తెలుసుకొని నాణ్యతా ప్రమాణాలతో వేగంగా పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఎస్ఈ రాజ్‌కుమార్, ఈఈలు సంజీవ్‌కు మార్, డీఈలు దేవేందర్, లచ్చిరెడ్డి, అరుణ్, వెంకటేశ్వర్లు, ఓంప్రకాశ్, ఏఈలు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ సేవలకు ప్లాట్‌ఫాం 'ఉమాంగ్'

- కేంద్ర ప్రభుత్వ అధికారిక యాప్‌లో అన్ని సైట్లు
- ఒకే యాప్‌లో 2 వేలకుపైగా వెబ్‌సైట్లు

7

అపార్ట్‌మెంట్‌లో చోరీ..

- 18 తులాల బంగారం, 111 తులాల వెండి, 1.55 లక్షల నగదు అపహరణ

6

ప్రజల మనోభావాలు దెబ్బతినేలా సీఎం వ్యాఖ్యలు

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి
- జిల్లా కేంద్రంలో నిరసన



సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు, కార్యకర్తలు

గణేశ్‌నగర్,డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్య లు ప్రజల మనోభావాలు దెబ్బతినేలా ఉన్నాయని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి పేర్కొన్నారు. సీఎం బేషరతుగా హిందూ సమాజానికి క్షమాపన చెప్పాలని అన్నారు. సీఎం వ్యాఖ్యలపై బుధవారం బీజేపీ జిల్లా శాఖ కరీంనగర్‌లోని తెలంగాణ చౌక్‌లో నిరసన చేపట్టి సీఎం దిష్టిబొమ్మను దహనం చేశారు. ఆనాడు కేసీఆర్ హిందూ దేవుళ్లను చులకన చేసి మాట్లాడారని నేడు సీఎం రేవంత్‌రెడ్డి కూడా అదే బాటలో నడుస్తు న్నారని అన్నారు. మూడు కోట్ల దేవతలంటూ ఒక్కో దేవునిపై రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు హిం దూ ప్రజల మనోభావాలు దెబ్బతినేలా ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ గుగ్గిల రమేష్, వాసాల రమేష్,కళ్లెం వాసుదేవరెడ్డి, గువ్వల శ్రీనివాస్,కటకంలోకేష్, జోన్ ప్రెసిడెంట్,పాదం శివరా జ్, బండారు గాయత్రి, తణుకు సాయి కృష్ణ, అవదుర్తి శ్రీనివాస్ నరహరి లక్ష్మారెడ్డి, ఆవిడల చైతన్య, నాంపల్లి శ్రీనివాస్, ప్రసన్న, యువ క్రాంతి, అక్షయ్, కట్ట రాజు, ప్రసాద్,బోయిన్ శ్రీను,జి రవి,అనిష్,పాశం తిరుపతి, ఆకుల నరేష్, అజయ్, వెంకటేష్, సందీప్, శ్రీధర్, అనిల్, విజయ్, కలికోట మోహన్, నారాయణ, జిత్తు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదులు సమాజానికి మార్గదర్శకంగా ఉండాలి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్ శివకుమార్

కరీంనగర్ క్రైం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): న్యాయవాదులు మేధావి వర్గమని, వారు సమాజానికి మార్గదర్శకంగా ఉండాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్ శివకుమార్ అన్నా రు. కరీంనగర్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కోర్టు ఆవరణలో బుధవారం నిర్వహించిన న్యాయవాదుల దినోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. న్యాయవాది అన్నింటిపై అవగాహన కలిగి ఉంటారని, వృత్తిలో క్షక్షిదారులకు న్యాయం చేయాలని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా మొదటి అదనపు జిల్లా జడ్జి శ్రీనివాస్, తెలంగాణ బార్ కౌన్సిల్ మెంబర్ కాసుగంటి లక్ష్మణ్‌కుమార్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు లింగంపల్లి నాగరాజు, ప్రధాన కార్యదర్శి అరున్ కుమార్ మాట్లాడారు. అనంతరం న్యాయవాదుల దినోత్సవంకు సంబంధించి నిర్వహించిన ఆటల పోటీలలో గెలుపొందిన న్యాయవాదులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా పలువురు న్యాయవాదులను సన్మానించారు. ఈ కార్యక్ర మంలో న్యాయమూర్తులు, సీనియర్, జూనియర్, మహిళా న్యాయవాదులు పాల్గొ న్నారు.



జ్యోతిప్రజ్వల చేస్తున్న జిల్లా ప్రధాన న్యాయ మూర్తి ఎస్ శివకుమార్

ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొని ఒకరి మృతి

● మరో ఇద్దరికి తీవ్ర గాయాలు

ధర్మారం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆగి ఉన్న ట్రాక్టను ఢీకొని ఒకరు మృతి చెందగా ఇద్దరు తీవ్ర గాయాలపాలైన ఘటన ధర్మారం మండలం పత్తిపాక గ్రామంలో చోటుచేసుకుంది. పత్తిపాకకు చెందిన నవనందుల రాజేష్, అరవెండి కిష్టయ్య, మంగారపు సాయికుమార్ అనే ముగ్గురు వ్యక్తులు బుధవారం బైక్‌పై గంగ స్నానానికి గోదావరికి వెళ్లారు. తిరిగి ఇంటికి వస్తున్న క్రమంలో పత్తిపాక గ్రామ డాంబర్ ప్లాంట్ సమీపంలో ఆగిఉన్న ట్రాక్టర్ ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో బండి నడుపుతున్న నవనందుల రాజేష్(36) అక్కడిక్కడే మృతిచెందగా కిష్టయ్య, సాయికుమార్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108సిబ్బంది గాయపడిన వారిని చికిత్స నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని ఎస్ఐ ప్రవీణ్ సందర్శించి వివరాలు సేకరించారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

కరీంనగర్ క్రైం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కరీంనగర్‌లోని సంతోష్‌నగర్‌కు చెందిన బోయినిపల్లి వెంకటరమణారావు(56) బుధవారం మధ్యాహ్నం మృతి చెందినట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు. గతనెల 30న వెంకటరమణారావు బైక్‌పై వెళ్తుండగా కుక్క అడ్డురావడంతో కిందపడ్డాడని, తలకు తీవ్రగాయాలవడంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారని పేర్కొన్నారు. వెంకటరమణారావు భార్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గాయపడిన వ్యక్తి మృతి

ధర్మపురి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని తీవ్ర గాయాలపాలైనవ్యక్తి మృతిచెందిన సంఘటన ధర్మపురి మండలంలో చోటుచేసుకుంది. మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం రెబ్బనపల్లి గ్రామానికి చెందిన కునసపల్లి మురళి(48) ఈ నెల 1న సుతారీ మీటింగ్ నిమిత్తం రెబ్బనపల్లి గ్రామానికి వెళ్లి తిరిగి వస్తుండగా ధర్మపురి మండలంలోని తిమ్మాపూర్ గ్రామ సమీపంలో పొలాల నుంచి వస్తున్న ఒక వ్యక్తి తన ద్విచక్ర వాహనంతో మురళి ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్నాడు. వెంటనే మురళిని హుటాహుటిన 108లో జగిత్యాల ఆస్పత్రికి తరలించగా, అక్కడి నుంచి కరీంనగర్ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మురళి భార్య గంగ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జి.మహేష్ తెలిపారు.

పురుగుల మందు తాగి యువకుడి ఆత్మహత్య

ఓదెల, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాంసానిపల్లికి చెందిన కందుల రాజు(35) అనేవ్యక్తి పురుగులమందు తాగి బుధవారం మృతిచెందాడు. మతిస్థిమితం సక్రమంగా లేక మంగళవారం ఇంటి వద్ద పురుగుల మందు తాగగా కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ మృతిచెందాడు. మృతుడి తండ్రి మొండయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పొత్కపల్లి ఎస్ఐ రమేష్ తెలిపారు.

ఘనంగా శ్రీకాంతాచారి వర్ధంతి



హుజూరాబాద్‌లో శ్రీకాంతాచారి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

హుజూరాబాద్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని అంబేద్కర్‌చౌరస్తా వద్ద విశ్వకర్మ మన్మయసంఘం ఆధ్వర్యంలో శ్రీకాంతాచారి వర్ధంతిని బుధవారం ఈ సందర్భంగా ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో శ్రీనివాస్, భిక్షపతి, రఘు, సత్యానారాయణ, శ్రీనివాస్, వీరాచారి, సదానందం, లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి డ్రైవింగ్ చేస్తున్న వ్యక్తిపై కేసు



డ్రైవర్‌కు డ్రంకెన్‌డ్రైవ్ టెస్టు చేస్తున్న ఎస్సై శ్రీకాంత్

తిమ్మాపూర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాజీవ్‌రహదారిపై బుధవారం రాత్రి ఓ లారీడ్రైవర్ అతివేగంగా అజాగ్రత్తగా లారీని నడుపుకుంటూ వెళ్తుండగా ఎల్ఎండీ పోలీసులు పట్టుకొని కేసు నమోదు చేసి లారీని సీజ్ చేశారు. ఎల్ఎండీ ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. ఓ లారీ అతివేగంగా అజాగ్రత్తగా నడుపుకుంటూ రాజీవ్ రహదారిపై వెలుతుండగా గమనించిన బ్లూకోల్ట్ సిబ్బంది లారీని వెంబడించారు. సుభాష్‌నగర్ వద్ద లారీని పట్టుకున్నారు. లారీ డ్రైవర్‌కు డ్రంకెన్‌డ్రైవ్ టెస్ట్ చేయగా అతిగా మద్యం సేవించినట్లు వచ్చింది. అతివేగంతో పాటు అతిగా మద్యం సేవించి లారీ నడుపుతున్న లారీ డ్రైవర్ మెదక్ జిల్లా నర్సింగ్ గ్రామానికి చెందిన కబ్బూజి వేణును అదుపులోని తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. లారీని సీజ్ చేసి ఎల్ఎండీ పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని ఎస్సై శ్రీకాంత్ హెచ్చరించారు

బీసీలపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం



నిరసన వ్యక్తం చేస్తున్న బీసీ జేఏసీ నాయకులు

హుజూరాబాద్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): నల్గొండ జిల్లాలో బీసీ సామాజిక బిడ్డపై అగ్రవర్ణాల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని బీసీ జేఏసీ, ప్రజాస్వామిక బీసీ ఉద్యమవేదిక నాయకులు అన్నారు. బుధవారం వారు వేర్వేరుగా హుజూరాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వాతంత్ర వచ్చి 78ఏళ్లు గడుస్తున్న అగ్రవర్ణాల ఆగడాలు రోజురోజుకు శృతి మించి పోతున్నాయన్నారు. నల్గొండ జిల్లాలోని యాదవ సామాజిక వర్గానికి చెందిన నాగలక్ష్మి తమ స్వగ్రామంలో సర్పంచ్ పదవికి నామినేషన్ వేయగా, ఆమెభర్త యాదగిరిని కిడ్నాప్‌చేసి మూత్రం తాగించిన సందీప్ రెడ్డిని చట్టపరంగా కఠినంగా శిక్షించాలన్నారు. వేర్వేరుగా జరిగిన కార్యక్రమంలో వెంకన్న, శ్రీనివాస్, ప్రభాకర్, సమ్మయ్య, కేశవులు, ఓదెలు, రామ్, సారన్న, మధుకర్, రవీందర్, శ్రీకాంత్, శ్రీనివాస్, సురేష్, క్రాంతి, రవీందర్, సదానందం, ప్రభాకర్, ముత్యంరాజు, ఖలీద్ హుస్సేన్, రాజేశ్వరరావు, చారి, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు కేంద్రం కానుక



- పీఎం సమృద్ధి యోజన ద్వారా భరోసా
- వేములవాడలో 3,260 మందికి రుణాలు

వేములవాడ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణాల్లో రోడ్లపక్కన తోపుడు బండ్లు, షెడ్లు వేసుకుని బతుకు బండితో జీవనం సాగిస్తున్న వీధి వ్యాపారు లకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రధానమంత్రి సమృద్ధి యోజన పథకం కానుకగా మారింది. తోపుడు బండ్లపై ఆధారపడి కాలం గడుపుతున్న వ్యాపారులను మున్సిపాలిటీ ఆధ్వర్యంలో గుర్తించి వారికి గుర్తింపు కార్డులు అందజేస్తే విడుతల వారీగా రూ.10వేల నుంచి 50 వేల వరకు బ్యాంకులు రుణ సదుపాయం కల్పించేలా పథకాన్ని రూపకల్పన చేశారు. ఈ పథకంలో వ్యాపారం చేసుకోవడానికి ఎలాంటి పర్మినెంట్ భవన సముదాయం లేని, కొట్టు లేని, షటర్స్ లేని, రెంట్ భవనం లేని వారు, వీధుల్లో పండ్లు, కూరగాయాలు, తోపుడు బండ్లను వినియోగించి వివిధ రకాల వస్తువులను విక్రయించేవారు, మటన్, చేపలను విక్రయించే వారు అర్హులు. వేములవాడ మున్సిపాలిటీలో కోనాయపల్లి, శాత్రాజుపల్లి, అయ్యోరుపల్లి, నాంపల్లి, తిప్పాపూర్ గ్రామాలు విలీనం కావడంతో 28 వార్డులుగా రూపాంతరం చెందింది. ఆధ్యాత్మిక క్షేత్రంగా బాసిల్లుతున్న పట్టణం కావడంతో పట్టణంలో చిరు, వీధి వ్యాపారులు ఎక్కువ మొత్తంలో జీవిస్తున్నారు. మున్సిపల్ కమిషనర్ అన్వేష్ ఆధ్వర్యంలో ఆర్పీ, సీఎల్ఆర్పీ, టీఎంసీలతో పట్టణ, సెమి అర్బన్ ప్రాంతాలలో చురుకైన వీధి వ్యాపారులు ఉన్న ప్రాంతాలను ముందుగా గ్రీన్, అంబర్, రెడ్ జోన్లుగా వర్గీకరించారు. గ్రీన్ జోన్ (వ్యాపారానికి అనుకులంగా) 3,133 మందిని, అంబర్ జోన్ (కాలనుగుణంగా వ్యాపారం చేసే వారు) 127 మందిని, రెడ్ జోన్‌లో ఎవరూ లేకపోవడంతో మొత్తంగా 3,260 మంది వ్యాపారులను గుర్తించారు.

● లబ్ధిదారులకు గుర్తింపు కార్డులు

వేములవాడ మున్సిపాలిటీ పరిధిలో ఇప్పటి వరకు 3,260 మంది లబ్ధిదారులను గుర్తించి వారికి గుర్తింపు కార్డులను అందించారు. అధికారులు సర్వే నిర్వహించి గుర్తించిన అనంతరం వ్యాపారులు ప్రస్తుతం తమ కొట్టు ఫోటో, ఆధార్ కార్డు జిరాక్స్, బ్యాంకు పాస్ పుస్తకం, జిరాక్స్‌లతో మున్సిపల్ కార్యాలయంలో సంప్రదించాలి. సంబంధిత ధ్రువపత్రాలను సిబ్బంది ఆన్‌లైన్ నమోదు చేసి ఐడీ కార్డులను వ్యాపారులకు అందిస్తారు. మొదటి విడతలో రూ. 10 వేలు బ్యాంకు మంజూరు చేస్తుంది. సంవత్సరం లోపు లోన్ డబ్బులు చెల్లిస్తే రెండవ విడుత రూ. 20 వేలు, మూడవ విడుత రూ. 50 వేలు బ్యాంకు వారు మంజూరు చేస్తున్నారు. ఇప్పటి వరకు మొదటి విడుతలో 2,453 మంది వ్యాపారులు రూ. 10 వేల రుణం తీసుకోగా, రెండవ విడుతలో 1,689 మంది రూ. 20 వేలు, 367 మంది రూ.50 వేల రుణాన్ని తీసుకుని తమ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు.

ఇది నిరంతర ప్రక్రియ

- అన్వేష్, మున్సిపల్ కమిషనర్, వేములవాడ



చిరు వ్యాపారులకు చేయుత ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి సమృద్ధి యోజన పథకం ప్రవేశపెట్టింది. ఈ పథకం ద్వారా పట్టణంలో వ్యాపారులను గుర్తించి ఐడీ కార్డులను అందజేశాం. బ్యాంకు నిబంధనలకు లోబడి రుణాలు ఎప్పటికప్పుడు చెల్లిస్తే రూ. 50 వేల వరకు లోన్ తీసుకోవచ్చు. ఇది నిరంతర ప్రక్రియ పట్టణంలో అర్హులైన చిరు, వీధి వ్యాపారులు ఉంటే ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

రవాణాశాఖ ఆధ్వర్యంలో.. వాహనాల తనిఖీ



పట్టుకున్న వాహనాలతో ఏఎమ్‌వీఐ

ఇల్లంతకుంట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో రవాణాశాఖ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు చేపట్టారు. ఏఎమ్‌వీఐ రజనీదేవి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన తనిఖీలలో సరైన ధ్రువపత్రాలు లేని 13వాహనాలను పట్టుకొని పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా ఇన్సూరెన్స్, ట్యాక్స్‌లు చెల్లించాలని సూచించారు. కొంత మంది వ్యవసాయానికి వినియోగించే ట్రాక్టర్లను రవాణాకు వాడుతున్నారని పేర్కొన్నారు. తనిఖీల్లో పట్టుబడితే భారీగా జరిమానాలు పడుతాయని, వాహనాల నంబర్ ప్లేటు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఉండాలని, వాహనదారులు తప్పనిసరిగా రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో రవాణాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సిలిండర్ల దొంగ అరెస్ట్

● 38 సిలిండర్లు స్వాధీనం



పట్టుబడిన సిలిండర్లతో పోలీసులు

జగిత్యాల టౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లాకేంద్రంలోని పలు ఇళ్లలో సిలిండర్లు అపహరించుకువెళ్ళిన నిందితుడిని అరెస్టు చేసినట్లు డీఎస్పీ రఘుచందర్ తెలిపారు. బుధవారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో మీడియా సమావేశంలో నిందితుడి వివరాలను డీఎస్పీ రఘుచందర్ వెల్లడించారు. జగిత్యాల పట్టణంలోని చిలుకవాడకు చెందిన షేక్‌సమీర్ అనే వ్యక్తి పట్టణంలోని ఓ సిలిండర్ గోదాంలో పనిచేస్తూ ఇళ్లకు గ్యాస్ సిలెండర్లను సప్లై చేస్తుండేవాడు. గోదాంలో పని మానేసిన తర్వాత సిలెండర్ల దొంగతనానికి పాల్పడినట్లు డీఎస్పీ తెలిపారు. గోదాంలో పని చేస్తున్న సమయంలో ఎవరి ఇంటి వద్ద రక్షణ లేకుండా సిలెండర్లు ఉంటాయో గమనించి పట్టణంలోని పలువురి ఇళ్లనుంచి 38సిలిండర్లను అపహరించుకొని వెళ్లాడు. సిలిండర్లు అపహరణకు గురైన పలువురు బాధితులు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయగా పట్టణ సీఐ కరుణాకర్ ఆధ్వర్యంలో పోలీసులు సీసీ టీవీ ఫుటేజీ ఆధారంగా నిందితుడిని గుర్తించి సిలిండర్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. సమావేశంలో పట్టణ సీఐ కరుణాకర్, పట్టణ ఎస్ఐలు ఎ.కుమారస్వామి,సిహెచ్ రవికిరణ్, ఎం. సుప్రియ, కానిస్టేబుల్ జీవన్ పాల్గొన్నారు.

యమధర్మరాజు ఆలయంలో ఆయుష్య హోమం



ఆయుష్య హోమం నిర్వహిస్తున్న అర్చకులు

ధర్మపురి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి లక్ష్మీనృసింహ స్వామి అనుబంధ దేవాలయం అయిన యమ ధర్మరాజు ఆలయంలో ఆయుష్యహోమం నిర్వహించారు. యమ ధర్మ రాజు వారికి పురుష సూక్తం, శ్రీలక్ష్మీసూక్తం, మన్యసూక్తంతో అభిషేకం, ఆయుష్య హోమం, ప్రత్యేకపూజలు, హారతి మంత్రపుష్పం కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్, జక్కు రవీందర్, ధర్మకర్తల మండలి సభ్యులు, సూపరింటెండెంట్ కిరణ్, అర్చకులు నేరెళ్ల వంశీకృష్ణ, వొద్దిపర్తి కళ్యాణ్ కుమార్, బొజ్జ సంపత్ కుమార్, సంతోష్ కుమార్, సిబ్బందిఅర్చకులు అధిక సంఖ్యలో భక్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

పెళ్లి చేసుకుంటానని.. మోసం చేసిన యువకుడి అరెస్టు

కరీంనగర్ క్రైం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని యువతిని మోసం చేసిన కేసులో నిందితుడు నగునూర్‌కు చెందిన బత్తిని శ్రావణ్‌కుమార్‌ను అరెస్టు చేసి జైలుకు తరలించినట్లు కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. సీఐ వివరాల ప్రకారం.. ఆసిఫాబాద్‌కు చెందిన యువతి(19) తన మేనత్తతో ప్రతిమ ఆస్పత్రికి వైద్యం కోసం వచ్చింది. ఆ సందర్భంలో ఆసుపత్రిలో రిసెప్షనిస్టుగా పనిచేస్తున్న కరీంనగర్‌రూరల్ మండలం నగునూరుకు చెందిన బత్తిని శ్రావణ్ కుమార్‌తో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం ప్రేమగా మారింది. వివాహం చేసుకుంటానని యువతిని నమ్మిస్తూ వచ్చాడు. ప్రేమ విషయం యువతి తన తల్లిదండ్రులకు చెప్పడంతో ఆమెను ఇంటి నుంచి పొమ్మన్నారు. అప్పటినుంచి శ్రావణ్‌కుమార్ ఫోన్‌స్విచ్ ఆఫ్ చేసుకోవడం, ఆమెను కలువకపోవడంతో నవంబరు 21న నగునూరులోని శ్రావణ్‌కుమార్ ఇంటికి వెళ్లింది. జరిగిన విషయం శ్రావణ్ తల్లిదండ్రులతో చెప్పింది. వారు ఆ యువతిని దూషించి వెనక్కి పంపించారు. ప్రేమ, పెళ్లి పేరుతో మోసం చేసిన శ్రావణ్‌కుమార్‌పై చర్యలు తీసుకోవాలని బాధిత యువతి కరీంనగర్‌రూరల్ పోలీసులకు, మహిళా పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ విషయం తెలుసుకున్న శ్రావణ్ కుమార్ తన మిత్రులను ఆ యువతి వద్దకు పంపించి తన సోదరి వివాహం అనంతరం రెండేళ్లకు వివాహం చేసుకుంటానని, అప్పటివరకు ఖర్చులు తానే భరిస్తానని బోదాసు దేవేందర్, దావు రవితేజ సమక్షంలో ఒప్పుకొని పేపర్‌పై రాసిచ్చాడు. ఆ మరుసటిరోజు నుంచి శ్రావణ్‌కుమార్ మళ్లీ ఫోన్ స్విచ్‌ఆఫ్ చేసుకొని యువతిని పట్టించుకోవడం లేదు. దీంతో శ్రావణ్‌కుమార్‌పై చట్టరిత్యా చర్యలు తీసుకోవాలని, తనకు న్యాయంచేయాలని రూరల్‌పోలీసులను ఆశ్రయించింది. యువతిని వైద్యపరీక్షల కోసం ప్రభుత్వాస్పత్రికి తరలించామని సీఐ తెలిపారు.

ఎట్టకేలకు మినీ స్టేడియం పనులకు మోక్షం

● గత ప్రభుత్వ హయాంలో అర్ధాంతరంగా నిలిచిన పనులు ● ఇటీవల రూ.5 కోట్లు మంజూరు చేసిన ప్రభుత్వం



మినీస్టేడియం గ్రౌండ్‌లో కంకర తేలిన ట్రాక్



నిర్మాణంలో ఉన్న భవన సముదాయాలు

వేములవాడ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వేములవాడ ప్రాంతంలో నిర్మించతలపెట్టిన మినీస్టేడియం పనులు పదకొండేళ్లుగా కొనసాగుతూనే ఉన్నాయి. తిప్పాపూర్ గ్రామ శివారులో 2014 సంవత్సరంలో రూ.2.10కోట్ల నిధులతో మినీస్టేడియం నిర్మాణ పనులు చేపట్టేందుకు అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రణాళికలు రూపొందించి పనులను ప్రారంభించారు. నిధుల విడుదలలో ప్రభుత్వం అలసత్వం వహించడంతో కాంట్రాక్టర్ చేతులెత్తేశారు.

క్రీడాకారుల విజ్ఞప్తి మేరకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సంబంధిత మంత్రితో మాట్లాడి ఇటీవల రూ.5కోట్ల నిధులు మంజూరు చేయించడంతో పనులు పుంజుకున్నాయి.


ప్రస్తుతం మినీ స్టేడియం పనులను త్వరగా పూర్తి చేసేందుకు సోషల్ వెల్ఫేర్‌శాఖ అధికారులకు అప్పగించారు. దీంతో వచ్చే మార్చి వరకు పనులను పూర్తిచేసేందుకు కార్యాచరణను రూపొందించినట్లు అధికారులు చెబుతున్నారు.

చివరి దశలో పనులు..

వేములవాడ ప్రాంత ప్రజల కోసం నిర్మించే మినీస్టేడియం పనులు ఎట్ట కేలకు చివరిదశకు వచ్చాయి. మినీస్టేడియంలో ఇప్పటివరకు డ్రెస్సింగ్ రూములు, కార్యాలయం భవనం, విశ్రాంతి భవనం, క్రీడా సామగ్రి భద్రపరిచే గదులు నిర్మాణ పనులు పూర్తిచేశారు. కిటికీలు, ప్రికాస్ట్ గోడలు, తలుపులతో పాటుగా ఇండోర్ స్టేడియం పైకప్పు పూర్తి చేశారు. ఆర్చీగేటు పనులు కొంతఆలస్యంగా కొనసాగుతున్నాయి. స్టేడియంలోని ట్రాక్‌పై కంకర తేలింది. సెప్టిక్ ట్యాంక్ నిర్మాణంతో పాటు ఇతర పనులు వచ్చే మార్చిలోపు పూర్తి చేస్తామని అధికారులు పేర్కొంటున్నారు.

అపార్ట్‌మెంట్‌లో చోరీ..

● 18 తులాల బంగారం, 111 తులాల వెండి, 1.55 లక్షల నగదు అపహరణ



తలుపునకు బిగించిన గడియను కట్ చేసిన దొంగలు

కరీంనగర్ క్రైం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ ప్రగతి నగర్‌లోని విజేత మనోహర హెవెన్స్ అపార్ట్‌మెంట్‌లో చోరీ జరిగింది. బాధితులు, పోలీసుల వివరాల ప్రకారం... మంగళవారం రాత్రి 2గంటల సమయంలో ముగ్గురు దొంగలు ముసుగులు, గ్లౌజ్‌లు ధరించి ప్లాట్ల తాళాలు పగుల గొట్టి దొంగతనం చేశారు. అపార్ట్‌మెంట్‌లోని కేశెట్టి సందీప్‌కుమార్ దగ్గరి బంధువు మరణించడంతో గతనెల 6వ తేదీన ప్లాట్‌కు తాళంవేసి కుటుంబ సభ్యులతో కలిసి గ్రామానికి వెళ్లాడు. బుధవారం ఉదయం అపార్ట్‌మెంట్ నుంచి ఫోన్ చేయడంతో ఇంటికి వచ్చేసరికి తన ప్లాట్ తాళం పగులగొట్టి ఉంది. బీరువా, పూజగదిలో భద్రపరిచిన 10తులాల బంగారం, 111తులాల వెండి, లక్షా55వేల రూపాయలు నగదు కని పించలేదు. దీంతో టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇదే అపార్ట్‌మెంట్‌లోని మరోప్లాట్‌లో నివాసం ఉంటున్న మూల కిష్టయ్య శనివారం తాళంవేసి గట్టెపల్లికి వెళ్లాడు. ఆయన భార్య 2నెలల కిందట మరణించింది దొంగలు ప్లాట్ తాళాలు పగులగొట్టి బెడ్‌రూంల్లోని సామగ్రి, దుస్తులను చిందరవందర చేశారు. బీరువాలోని ఎనిమిది తులాల బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లారు. ఏడాది కిందట ఈ అపార్ట్‌మెంట్ పక్కన ఉన్న ఇంటితాళాలు పగులగొట్టిన దొంగలు బంగారం, నగదు, ఇతర విలువైన వస్తువులను దోచుకెళ్లారు. ఆ కేసులో ఇప్పటి వరకు నిందితులను పట్టుకోలేదని బాధితుడు రఘునందన్‌రావు వాపోయాడు.

● ఉదయం 2గంటల ప్రాంతంలో అపార్ట్‌మెంట్ వెనుకవైపు నుంచి ప్రహరీ దూకిన ముగ్గురు దొంగలు మొదట వాచ్‌మెన్ ఇంటి తలుపునకు గడియపెట్టారు. అనంతరం అపార్ట్‌మెంట్‌లోని తాళం వేసిన ప్లాట్‌ల వద్దకు వెళ్లి ఎదుట, పక్కన ప్లాట్‌ల తలుపులకు బయట నుంచి గడియపెట్టారు.

ఆయాప్లాట్‌ల తాళాలు పగులగొట్టి లోపలికి చొరబడ్డారు. దాదాపు 3గంటల వరకు ముగ్గురుదొంగలు అపార్ట్‌మెంట్‌లోనే గడిపారు. ఎవరూ బయటకు రాకపోవడంతో వారిపని కానిచ్చారు. వాచ్‌మెన్ కూతురు 3గంటల ప్రాంతంలో బయటకు వచ్చేందుకు ప్రయత్నించగా బయటవైపున గడియపెట్టిన విషయం అర్థమైంది. వెంటనే అపార్ట్‌మెంట్ వారిని వాచ్‌మెన్ అప్రమత్తం చేశాడు. అలికిడి వినడంతో దొంగలు అక్కడినుంచి పరారీ అయ్యారు. దొంగలు కొంతదూరంలో పార్క్ చేసినట్లు గుర్తించారు. సీసీ కెమెరాలలో దొంగతనం మొత్తం రికార్డు అయ్యింది. సంఘటన స్థలాన్ని టూటౌన్ సీఐ సృజన్‌రెడ్డి, ఎస్సై అరుణ్ పరిశీలించారు. క్లూస్‌టీం రెండు ప్లాట్‌లలో ఆధారాలను సేకరించింది. బాధితుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అడవిపందుల బీభత్సం

కోనరావుపేట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండల కేంద్రంలో అడవిపందులు మంగళవారం రాత్రి బీభత్సాన్ని సృష్టించాయి. కొనుగోలు కేంద్రంలో ధాన్యం మీద కప్పిన కవ ర్లను చించివేశాయి. ధాన్యం కొనుగోలు కేంద్రా ల్లో ప్రతిరోజు రాత్రిపూట ఇదే పరిస్థితి నెలకొందని రైతులు వాపోతున్నారు. అధికారులు ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని కాపాడుకోవడానికి వ్యక్తులను నియమించాలని కోరుతున్నారు. అధికారులు కాపలా ఎవరిని పెట్టకపోవడంతో అడవి పందులతో నష్టపోతున్నామని తెలిపారు.

బీరు బాటిళ్లు దాచిన ఘటనపై విచారణ

● ముగ్గురు కానిస్టేబుళ్లపై చర్యలు

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్ గ్రామంలో ఈనెల 2న యువకులు తరలిస్తున్న బీరు బాటిళ్లను ఎక్సైజ్ కానిస్టేబుళ్లు స్వాధీనపర్చుకుని 4బీరు బాటిళ్లను దాచుకున్న ఘటనపై ఆ శాఖ సూపరిండెంట్ శ్రీనివాస్‌రావు బుధవారం విచారణచేపట్టారు. కానిస్టేబుళ్లు వ్యవహరించిన తీరుపై ఆరా తీశారు. బీరు బాటిళ్లను దాచుకున్నట్లు నిర్ధారణ కావడంతో కానిస్టేబుళ్లు రాజు, కిశోర్, మల్లేశంను కరీంనగర్ నోడల్ కార్యాలయానికి సరెండర్ చేశారని సీఐ శ్రీనివాస్ పేర్కొన్నారు.

శ్మశాన వాటికలో విద్యుత్తు తీగ చోరీ

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి గ్రామశివారు శ్మశానవాటికలో ఉన్న బోరు మోటారు విద్యుత్ తీగను గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం అపహరించుకుపోయారని స్థానికులు తెలిపారు. కరెంటు తీగ విలువ సుమారు రూ.7వేలు ఉంటుందని పేర్కొన్నారు.

రూ.7250 పలికిన పత్తి ధర

జమ్మికుంట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7250 పలికింది. బుధవారం మార్కెట్ యార్డుకు 53మంది రైతులు 338 క్వింటాళ్ల విడిపత్తి విక్రయానికి తీసుకొ చ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం ద్వారా గరిష్ఠ ధర రూ.7250, కనిష్ఠ ధర రూ.6600 చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీల్లో తృతీయస్థానం



పతకాలు సాధించిన విద్యార్థులు

పెద్దపల్లి కల్చరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి మహిళా టేబుల్ టెన్నిస్ పోటీల్లో జిల్లా మహిళాజట్టు తృతీయస్థానం సాధించింది. హైదరాబాద్‌లోని మోహినాబాద్ ఫైర్ఫాక్స్ స్పోర్ట్స్ రిసార్ట్‌లో గతనెల 28న జరిగిన 12వ రాష్ట్రస్థాయి ఇంటర్ జిల్లా టేబుల్‌టెన్నిస్ చాంపియన్ పోటీల్లో పెద్దపల్లిజిల్లా మహిళాజట్టు హైదరాబాద్‌తో తలపడగా పెద్దపల్లి జట్టు తృతీయస్థానంలో నిలిచి పతకాలు సాధించింది. విజయం సాధించిన జట్టును జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షుడు కోడం అజయ్, సుల్తానాబాద్ స్పోర్ట్స్‌క్లబ్ అధ్యక్షుడు ముస్త్యాల రవీందర్, ప్రధాన కార్యదర్శి బొల్లి సత్యనారాయణ, అసోసియేషన్ సభ్యులు పల్ల సురేష్, దాసరి రమేష్, ఎస్కే ఇక్బాల్, ప్రణయ్, తిరుపతి అభినందించారు.

రెజ్లింగ్ పోటీల్లో విద్యార్థులకు పతకాలు



బానోతు శృతి | లియాన

కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబరు 3 (ఆంధ్ర జ్యోతి): కామారెడ్డి జిల్లాలోని జుక్కల్‌లో ఈ నెల1 నుంచి 3వరకు జరిగిన 69వ రాష్ట్ర స్థాయి పాఠశాలల అండర్-14 రెజ్లింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో కరీంనగర్ సప్తగిరికాలనీ ప్రభుత్వపాఠశాల విద్యార్థినులు సత్తాచాటి పతకాలను కైవసం చేసుకున్నట్లు ఫిజికల్ డైరెక్టర్ అంతటి శంకరయ్య తెలిపారు. 58కేజీలలోపు విభాగంలో బానోతు శృతి అద్వితీయ ప్రతిభకనబరిచి బంగారు పతకం కైవసం చేసుకొని జాతీయస్థాయి పోటీలకు ఎంపికయిందని తెలిపారు. అలాగే 54 కేజీలలోపు విభాగంలో రాణించిన లియాన కాంస్యపతకం సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినులను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ముల్కూరి రాజేందర్, ఉపాధ్యాయులు అభినందించారు.



ఆన్‌లైన్ సేవలకు ప్లాట్‌ఫాం ఉమాంగ్

- కేంద్ర ప్రభుత్వ అధికారిక యాప్‌లో అన్ని సైట్లు
- ఒకే యాప్‌లో 2 వేలకుపైగా వెబ్‌సైట్లు

చొప్పదండి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను, సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ఉమాంగ్ యాప్‌ను రూపొందించారు. ఆన్‌లైన్ సేవలకు కేంద్ర ప్రభుత్వం అధికారిక డిజిటల్ గవర్నెన్స్ అప్లికేషన్‌గా ఉమాంగ్(యూనిఫైడ్ మొబైల్ అప్లికేషన్ ఫర్ న్యూ ఏజ్ గవర్నెన్స్)ను రూపొందించింది. కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వశాఖ దాదాపు 2 వేలకుపైగా వెబ్‌సైట్లు ఉమాంగ్‌లో అందుబాటులో ఉన్నాయి. 13 ప్రాంతీయ భాషల్లో అందుబాటులో ఉంది. మైస్కీం, డిజిలాకర్‌కు అనుసంధానంగా ఈ యాప్ పనిచేస్తుంది. ప్రభుత్వ సేవలకు వేర్వేరు వెబ్‌సైట్లు, యాప్స్‌కు అవకాశం లేకుండా, కార్యాలయాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఇంటి నుంచే మొబైల్ ఫోన్‌లో సేవలను పొందవచ్చు.

అందుబాటులో సేవలు

రాష్ట్రానికి సంబంధించిన మీసేవ, రేషన్ కార్డు, జనన ధ్రువీకరణ పత్రం, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ సర్టిఫికెట్, నివాస ధ్రువీకరణ పత్రాలు, మ్యారేజ్ సర్టిఫికెట్‌కు ఉమాంగ్ యాప్‌లో దరఖాస్తు చేసుకోవాలి. పింఛన్లకు సంబంధించిన లైఫ్ సర్టిఫికెట్, విద్యార్థులకు కాలేజీలు, యూనివర్సిటీలు, అప్రూవ్‌డ్ విద్యాసంస్థల వివరాలు తెలుసుకోవచ్చు. ఏఐసీటీఈ, ఎస్ఎస్‌సీ వెకెన్సీలు తెలుసు కోవచ్చు. యూజీసీకి సంబంధించిన ఈ బుక్స్, సిలబస్, పాత సంవత్సరాల ప్రశ్నాపత్రాలు, రీసెర్చ్ వివరాలు అందు బాటులో ఉంటాయి. పరీక్ష క్యాలెండర్ వివరాలు తెలుసుకోవచ్చు. రేషన్ కార్డులు, ఎల్‌పీజీ గ్యాస్ బుకింగ్, విద్యుత్ బిల్, రైతులకు సంబంధించిన ఈనామ్ మార్కెట్ వివరాలు, పీఎం కిసాన్ యాప్ ద్వారా ఉత్పత్తుల క్రయవిక్రయాలు చేసుకో వచ్చు. ఇవే కాకుండా స్త్రీ శిశు సంక్షేమశాఖ, యూత్ స్కిల్ ఎంపవర్‌మెంట్, వైద్య సర్వీ సులు, పోలీస్, రవాణాతోపాటు అనేక శాఖల సేవలన్నీ ఉమాంగ్‌లో అందుబాటులో ఉన్నాయి.

కేంద్ర ప్రభుత్వ సేవలు

ఆధార్, పాన్, డ్రైవింగ్ లైసెన్స్‌లను డిజిటల్‌గా యాప్‌లో స్టోర్ చేసుకుని షేర్ చేసుకోవచ్చు. ఈపీఎఫ్‌వో సేవలను పొందవచ్చు. ప్రావిడెంట్ ఫండ్ బ్యాలెన్స్ చెక్ చేసుకోవచ్చు. పాస్‌పోర్టు సేవలు, పింఛన్ పత్రాలు, సర్టిఫికెట్‌ను పొందవచ్చు. 2 వేలకు పైగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సేవలన్నీ యాప్ ద్వారా పొందవచ్చు.

యాప్ డౌన్‌లోడ్ ఇలా

మొబైల్‌లోని గూగుల్ ప్లే స్టోర్, ఆండ్రాయిడ్ లేదా యాప్ స్టోర్‌లోకి వెళ్లి ఉమాంగ్ అని సెర్చ్ చేసి డౌన్‌లోడ్ చేసుకోవాలి. యాప్ ఓపెన్ చేసిన తర్వాత భాషను ఎంచుకోవాలి. న్యూ యూసర్/రిజిస్టర్‌ను క్లిక్ చేసి మొబైల్ నెంబర్‌ను ఎంటర్ చేస్తే ఓటీపీ వస్తుంది. ఎంపిన్‌ను సెట్ చేసుకున్న తర్వాత ఆధార్ డేటాను నమోదు చేయాలి. లాగిన్ అయిన తర్వాత డాష్ బోర్డులో ఆల్ సర్వీసెస్ ద్వారా కావాల్సిన సేవను ఎంచుకోవాలి. 80 కేంద్ర ప్రభుత్వ శాఖలకు సంబంధించిన 1,745 ఆన్‌లైన్ సేవలు, వివిధ రాష్ట్రాల సేవలు యాప్‌లో అందుబాటులో ఉన్నాయి.

ముగిసిన బీచ్ వాలీబాల్ పోటీలు



కేశవపట్నంలో జరిగిన పోటీల్లో తలపడుతున్న విద్యార్థులు

శంకరపట్నం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం కేశవపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉమ్మడి జిల్లా స్థాయి బీచ్ వాలీబాల్ అండర్-14, అండర్-17 బాలబాలికల ఎంపికపోటీలను బుధవారం నిర్వహించారు. ఉమ్మడిజిల్లాలోని వివిధపాఠశాలల నుంచి సుమారు 150మంది క్రీడాకారులు హాజరయ్యారు. అనంతరం ప్రధానోపాధ్యాయుడు సుభాష్ మాట్లాడుతూ ఎంపికైన క్రీడాకారులు ఈనెల 7నుంచి 9వరకు ఖమ్మంజిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. రాష్ట్ర వ్యాయామ ఉపాధ్యాయసంఘం ఉపాధ్యాయుడు కాముౌజు కృష్ణ, హ్యాండ్ బాల్ అసోసియేషన్ ఆఫ్ కరీంనగర్ సెక్రెటరీ శ్రీను, మోడల్ స్కూల్‌పీడీ అధ్యక్షుడు అనూప్‌రెడ్డి, కోశాధికారి వీరపాల్‌రెడ్డి, రాజ్‌కుమార్, సత్యనారాయణ, నిర్మల, సాగర్, మహేష్‌హరీష్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన సైనిక్ స్కూల్ విద్యార్థి



ఎన్ సిద్ధు

చొప్పదండి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రుక్మాపూర్ సైనిక్‌స్కూల్ విద్యార్థి జాతీయ స్థాయి రెజ్లింగ్‌పోటీలకు ఎంపికయ్యాడు. ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి అండర్-14 రెజ్లింగ్ పోటీల్లో 8వ తరగతి విద్యార్థి ఎస్.సిద్ధు రాష్ట్రస్థాయిలో బంగారు పతకాన్ని సాధించాడు. ఇదే స్కూల్‌కుచెందిన వరుణ్‌తేజ కాంస్య పతకం గెలుచుకున్నాడు. విద్యార్థులను, కోచ్‌వంశీకృష్ణ, పీఈటీ సుమన్, విక్రమ్‌ను డైరెక్టర్ కర్నల్ రాజాదత్త, ప్రిన్సిపాల్ లింగయ్య, ఎస్‌వీపీ శ్రీనివాస్, ప్రమోద్‌రాజు అభినందించారు.

అంధుల పాఠశాల విద్యార్థితో కలిసి పాట పాడిన కలెక్టర్



విద్యార్థితో కలిసి పాడుతున్న కలెక్టర్

కరీంనగర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి, ప్రతినిధి): కరీంనగర్‌లోని అంధుల పాఠశాల విద్యార్థిని సింధుశ్రీతో కలిసి కరీంనగర్ జిల్లాకలెక్టర్ పమేలా సత్పతి పాట పాడారు. బుధవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని దివ్యాంగులలో స్ఫూర్తి నింపేందుకు పాటను యూట్యూబ్‌లో పోస్ట్ చేశారు. సినీగేయ రచయిత చంద్రబోస్ 2009లోవిడుదల చేసిన నింగినేల నాదే.. అనే సినిమా కోసం రాసిన 'ఆరాటం ముందు ఆటంకం ఎంత' అనే పాటను విద్యార్థినితో కలిపి పాడారు. గతలో సింధుశ్రీ పాటపాడటం చూసిన కలెక్టర్ పాట పాడగా, కరీంనగర్ అంధుల పాఠశాల మ్యూజికల్ టీచర్ సరళ, స్థానిక మ్యూజిక్ డైరెక్టర్ కెబి శర్మ ఆధ్వర్యంలో పాటను రికార్డు చేశారు. గతంలోనూ జిల్లాకలెక్టర్ ఆడపిల్లను రక్షించుకుందాం అంటూ పాడిన ఓ చిన్ని పిచుక పాటకు విశేష ఆదరణ లభించింది.

సడన్ బ్రేక్ వేసిన బస్ డ్రైవర్

- 11మందికి గాయాలు

హుజూరాబాద్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్‌లో కారును తప్పించబోయి ఆర్టీసీ బస్సు డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో బుధవారం రాత్రి పెను ప్రమాదం తప్పింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్-1 డిపోకు చెందిన ఎలక్ట్రిక్ బస్సు వేములవాడకు వెళ్తోంది. ఈ క్రమంలో హుజూరాబాద్ శివారులోని పరకాల క్రాస్ రోడ్ వద్దకు చేరుకోగానే అకస్మాత్తుగా ఓ కారు బస్సుకు అడ్డుగా వచ్చింది. దీంతో కారును తప్పించబోయి ఆర్టీసీ డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో సీట్లలో ఉన్న ప్రయాణికులు ఒక్కసారిగా ముందు సీట్లకు తగిలి కింద పడిపోయారు. ఈ ఘటనలో 11 మందికి గాయాలు కావడంతో వెంటనే హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. డ్రైవర్ నిర్లక్ష్యం వలనే ప్రమాదం జరిగిందని ప్రయాణికులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

బధిరుల పాఠశాలల్లో ఇంటర్ విద్య

- రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

కరీంనగర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): బధిరుల ఆశ్రమ పాఠశాలల్లో వచ్చే విద్యాసంవత్సరం నుంచి ఇంటర్ తరగతులు ప్రారంభిస్తామని ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ దివ్యాంగుల వయోవృద్ధుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. బుధవారం రేకుర్తిలోని బధిరుల ఆశ్రమ పాఠశాలలో మహిళలు, పిల్లలు, వికలాంగులు, వయో వృద్ధులశాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. మహిళా శిశుసంక్షేమశాఖ ప్రిన్సిపల్‌సెక్రెటరీ అనితా రామచంద్రన్, వయోవృద్ధుల దివ్యాంగుల సంక్షేమశాఖ డైరెక్టర్ శైలజతోకలిసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని, చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించేలా సహాయసహకారాలు అందిస్తామని అన్నారు. దివ్యాంగులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో ఐదుశాతం కేటాయించేలా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేస్తామన్నారు. దివ్యాంగుల సంక్షేమానికి రాష్ట్రప్రభుత్వం 50కోట్లరూపాయలు కేటాయించిందన్నారు. దివ్యాంగులైన ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాష్ట్రంలోని అన్ని బధిరుల ఆశ్రమ పాఠశాలల్లో సౌకర్యాలు కల్పిస్తామన్నారు. నిపుణులైన అధ్యాపకులను నియమించి సైన్‌లాంగ్వేజ్ ద్వారా తరగతులు బోధిస్తామన్నారు. దివ్యదృష్టిని వృథా చేయవద్దని, ఆసక్తి ఉన్న రంగాల్లో రాణించాలని అన్నారు. ఆర్టీసీ బస్సు పాసుల సమస్య మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. వచ్చే సంవత్సరం దివ్యాంగుల దినోత్సవం నాటికి సమస్యలన్నీ పరిష్కరించనున్నట్లు హామీ ఇచ్చారు. దివ్యాంగుల శిశుసంక్షేమశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ అనిత రామచంద్రన్ మాట్లాడుతూ మన చుట్టూ ఉన్న దివ్యాంగుల్లో ప్రతిభ దాగి ఉంటుందని, వారిని ప్రోత్సహిస్తే అద్భుతాలు సృష్టిస్తారని అన్నారు. సైన్ లాంగ్వేజ్‌లో జనగణ మన పాడిన కలెక్టర్ బృందాన్ని అభినందించారు. స్కిల్ ట్రైనింగ్ ఇచ్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. యూపీఎస్సీ వంటి ఉన్నతఉద్యోగాల్లో దివ్యాంగులు రాణిస్తున్నట్లు చెప్పారు. వయోవృద్ధుల దివ్యాంగుల సంక్షేమశాఖ డైరెక్టర్ శైలజ మాట్లాడుతూ దివ్యాంగులు ఆత్మస్థైర్యం పెంచుకోవాలని, రాష్ట్రంలో ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని అన్నారు. జిల్లాలో దివ్యాంగుల సంక్షేమం కోసం కలెక్టర్ చేపడుతున్న కార్యక్రమాలను అభినందించారు. దివ్యాంగుల కో-ఆపరేటివ్ చైర్మన్ వీరయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులతో స్వయం సహాయక సంఘాల ఏర్పాటుకు శ్రీకారంచుట్టిందన్నారు. 40శాతం వైకల్యం ఉన్న దివ్యాంగులకు పరికరాలు అందిస్తున్నట్లు చెప్పారు. సుడాచైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో డీసీబీసీ భవన నిర్మాణానికి కృషి చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కలెక్టర్ పమేలాసత్పతి, జిల్లా సంక్షేమాధికారి సరస్వతి, మెప్మా పీడీ స్వరూపరాణి, అధికారులు,వికలాంగుల సంక్షేమసంఘం ప్రతినిధులు, దివ్యాంగులు పాల్గొన్నారు.



వేడుకలో మాట్లాడుతున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



వేడుకలో నాటకం ప్రదర్శిస్తున్న విద్యార్థులు

బాలుడి కుటుంబానికి అండగా ఉంటాం..

హైదరాబాద్‌లో వీధి కుక్కల దాడిలో గాయపడిన బాలుడి కుటుంబానికి అన్నివిధాల అండగా ఉంటామని మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. అతడి కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, దివ్యాంగులశాఖ ద్వారా మెరుగైన వైద్యసేవలు అందిస్తామన్నారు. బాలుడి చదువు బాధ్యతలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఘనంగా మల్లికార్జున స్వామి జాతర

- బోనాలు సమర్పించిన భక్తులు



ఆలయం చుట్టూ బోనాలతో ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

గొల్లపల్లి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గొల్లపల్లి మండలం మల్లన్నపేట మల్లికార్జున స్వామి జాతరకు బుధవారం భారీ సంఖ్యలో భక్తులువచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులు బెల్లం పానకంతో వండిన బోనాలను నెత్తిన ఎత్తుకుని ఒగ్గు పూజారుల ఢమరుక నాదాల నడుమ, శివసత్తుల పూనకాల మధ్య ఆలయం వద్దకు ఊరేగింపుగా తరలివచ్చారు. ఈ సందర్భంగా బోనాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి మల్లికార్జున స్వామికి బోనాలు సమర్పించారు. అనంతరం క్యూలైన్‌లోగర్భగుడిలోకి తరలివెళ్లి స్వామివారిని దర్శించుకొని పసుపు, బెల్లం, బంతిపూలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పలువురు భక్తులు తమ చిన్నారులకు పుట్టువెంట్రుకలు తీయించగా, మరికొందరు భక్తులు నిలువెత్తు బంగారం(బెల్లం) తులాభారంవేసి భక్తులకు పంచిపెట్టారు. ఒగ్గు పూజారుల ఆధ్వర్యంలో మల్లన్న పట్నాలు వేసి ప్రత్యేకమొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు కొండూరి రాజేందర్ శర్మ, కొండూరి రఘునందన్ శర్మ వేదమంత్రోచ్ఛరణల నడుమ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుమారు 20 వేలమంది భక్తులు స్వామివారిని దర్శించుకోగా, ప్రత్యేక దర్శనానికి విక్రయించిన టికెట్ల ద్వారా ఆలయానికి రూ.79,510 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఫౌండర్‌ట్రస్టీ కొండూరి శాంతయ్య తెలిపారు. ట్రైనీకలెక్టర్ కన్నంహరిణి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐలు రాంనర్సింహారెడ్డి, శ్రీనివాస్, ఎస్సైలు కృష్ణాసాగర్ రెడ్డి, గీతా, టౌన్ ఎస్సై కుమార స్వామి ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు. ఏర్పాట్లను ఆలయ ఈవో విక్రమ్, ఆలయ ఫౌండర్ ట్రస్టీ కొండూరి శాంతయ్య పర్యవేక్షించారు.

భీమన్న సన్నిధి వైపు వాహనాలకు బ్రేక్

- రెండు వైపులా రహదారి బంద్



ఉత్తరం వైపు బారికేడ్లతో మూసివేసిన రహదారి

వేములవాడ టౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి అనుబంధ ఆలయమైన భీమేశ్వరాలయానికి వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. మేడారం సమ్మక్క సారలమ్మ జాతరకు వెళ్లే భక్తులు ముందుగా వేములవాడకు వచ్చి స్వామి వారిని దర్శించుకొని వెళ్లడం ఆనవాయితీగా వస్తోంది. ఈ క్రమంలో వేములవాడకు భక్తుల రాక రోజురోజుకు పెరుగుతోంది. దీంతోభక్తుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని భీమేశ్వరాలయం వైపు వాహనాల రాకపోకలను నిలిపివేశారు. కేవలం భక్తులు వెళ్లేవిధంగా ఏర్పాట్లు చేశారు. రహదారిని పూర్తిగా బారికేడ్లు పెట్టి మూసివేశారు. ప్రధానంగా నటరాజ్ విగ్రహం ఉత్తరం వైపు, పార్వతీపురం అన్నదాన సత్రం వైపు బారికేడ్లు పెట్టి రహదారులు మూసివేశారు. దీంతో స్థానికుల వాహనాలు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. మరోవైపు పార్కింగ్ స్థలం వద్ద భారీ గేట్ ఏర్పరిచి కేవలం వీఐపీ వాహనాలను మాత్రమే అనుమతిస్తున్నారు. భీమేశ్వరస్వామి ఆలయానికి భక్తులు చేరుకోవాలంటే వాహనాలు పార్కింగ్‌లో పెట్టి కిలోమీటర్ నడవాల్సిన పరిస్థితి ఉంది. ఈ విధంగా దేవాలయానికి దక్షిణం వైపు విస్తరణ పేరిట ఇరువైపులా రహదారులు మూసివేశారు. దీంతో భక్తుల వాహనాలు, స్థానికుల వాహనాలు ఎటు వెళ్లాలో తెలియని పరిస్థితి ఏర్పడింది. ఇందుకు ప్రత్యామ్నాయంగా వేములవాడ పట్టణంలో పలుచోట్ల దేవాలయాలకు వెళ్లే మార్గాలను సూచించే బోర్డులు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

ప్రారంభమైన లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాలు



పూజలు నిర్వహిస్తున్న పండితులు

తంగళ్లపల్లి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో లక్ష్మీనర్సింహస్వామి దేవాలయంలో ద్వితీయ బ్రహ్మోత్సవాలు ప్రారంభ మయ్యాయి. బుధవారం జ్యోతిష్య వాస్తు ఆగమశాస్త్ర పండితులు శ్రీమాన్ నమిలకొండ రమణాచారిస్వామి ఆధ్వర్యంలో ఉదయం నుంచి పూజాకార్యక్రమలు జరిగాయి. సాయంత్రం ఎదురుకోళ్ల ఉత్సవం వైభవంగాసాగింది. కార్యక్రమంలో చినజీయర్‌స్వామి శిష్యబృందం శ్రీకాంత్ ఆచార్యులు, రామకృష్ణమాచార్యులు, శశాంక్, వినయ్‌కుమార్ ఆచార్యులు, శ్రీకాంత కౌశిక్, వివేక్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

దత్తాత్రేయ స్వామి జయంతి ఉత్సవాలు ప్రారంభం



పూజలు నిర్వహిస్తున్న పండితులు

బోయినపలి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): బోయినపల్లి మండలం వరదవెల్లి గ్రామ సమీపంలోని గుట్టపై దత్తాత్రేయ స్వామి జయంతి ఉత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడురోజులపాటు ఉత్సవాలు ఘనంగా జరగనున్నాయి. బుధవారం ఆలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని దర్శించుకునేందుకు పర్యాటక శాఖ ఆధ్వర్యంలో మూడు బోట్లను అందుబాటులో ఉంచారు. భక్తులు భక్తులు స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఎస్సై రమాకాంత్, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లను పర్యవేక్షించారు.

తొలి విడత ఉపసంహరణలు.. రెండో విడత పరిశీలన

- వేగంగా నామినేషన్ల ప్రక్రియ
- పలు చోట్ల ఏక గ్రీవం, పోటాపోటీ
- గ్రామాల్లో పంచాయతీ ఎన్నికల సందడి


తిమ్మాపూర్ మండల ప్రజాపరిషత్ కార్యాలయం

కరీంనగర్ రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో భాగంగా నామినేషన్ల ప్రక్రియ వేగవంతమైంది. బుధవారం పలు మండలాల్లో తొలివిడత ఎన్నికల నామినేషన్ల ఉపసంహరణ, రెండో విడత పరిశీలన చేపట్టారు. కరీంనగర్ రూరల్ మండలంలో 14 పంచాయతీలకు 68 నామినేషన్లలో 11 మంది సర్పంచ్ స్థానాలకు ఉపసంహరించుకున్నారు. 57 మంది అభ్యర్థులు పోటీలు ఉన్నట్లు ఎన్నిల అధికారులు తెలిపారు. 132 వార్డుల్లో 32 ఏకగ్రీవమవగా 100 వార్డులకు 246 మంది బరిలో ఉన్నారు. నల్లగుంటపల్లిలో మొత్తం 8 వార్డు స్థానాలకు ఇప్పటికే 5 ఏకగ్రీవమవగా ఉపసంహరణలో మిగతా మూడు ఏకగ్రీవమయ్యాయి. పోటీలో ఉన్న సర్పంచ్ అభ్యర్థుల్లో బహదూర్‌ఖాన్ పేట బల్ల సౌమ్య, గుర్రం సంధ్య, గుర్రం సత్తమ్మ, తప్పట్ల సుమలత, చామనపల్లి బోగొండ ఎల్లయ్య, బొం మునిగంటి కుమార్, తిప్పర్తి లక్ష్మయ్య, చేగుర్తి బాసవేని సరోజన యాదవ్, గాండ్ల విజయ, కుకట్ల సత్య, సంధ్య సందవేణి, చెర్ల బూత్కూర్ దుబ్బసి హరీష్, కూర నరేష్ రెడ్డి, కుర శ్యాంసుందర్ రెడ్డి, మాడిశెట్టి అఖిల్, పంది శ్రీనివాస్, రేగుల రమేష్, దుబ్బపల్లిలో గాదె తిరుపతి రెడ్డి, మోతె ప్రశాంత్ రెడ్డి, రంగ రెడ్డి పబ్బతి, ఎలబోతారం బొచ్చల కొమురయ్య, బొచ్చల మల్లేశం, ఎల్కతుర్తి రమేష్, ఎల్కతుర్తి ఆనంద్, తప్పట్ల రాజు, ఫకీర్‌పేట బేతి మౌనిక, బొద్దుల విజయలక్ష్మీ, కటుకం శారద, ఇరుకుల్ల అంజలి కుంభం, బలుసుల శంకరయ్య, బుర్ర రమేష్, కాశిపాక లక్ష్మీ, మహమ్మద్ సర్వర్, జూబ్లీనగర్ ముంజంపల్లి రమేష్, రుద్ర రాము, సుద్దాల కమలాకర్, మందులపల్లి మేకల పుష్ప, మేలక శకుంతల,పేరాల నవత, పేరాల రమ, వొంటెద్దు భారతి మొగ్దుంపూర్ గొల్లె లక్ష్మీ, మాదాసు సీనమ్మ, మీసాల మహేశ్వరి, మీసాల సుజాత, తాండ్ర వసంత, నగునూర్‌లో మేతుకు హేమలత, నర్సింగోజు అన్నపూర్ణ, పెంచాల లావణ్య, సాయిల్ల శ్రావణి, నల్లగుంటపల్లి కిరణ్ కుమార్ వడ్లూరి, వడ్లూరి అంజయ్య, వడ్లూరి పొచయ్య, తహేర్ కొండాపూర్ ఆకుల యాదగిరి, కన్నవేని తిరుపతి, మడికంటి మారుతి, పొరెల్ల రాజు ఉన్నారు.

గంగాధర: గంగాధర మండలంలో 33 సర్పంచ్ స్థానాలకు 138 మంది పోటీ పడు తున్నారు. మండలంలో 296 వార్డులకు 102 వార్డు స్థానాలు ఏకగ్రీవం కాగా 194 వార్డులకు 583 మంది బరిలో నిలిచారు. ఈ సందర్భంగా ఎన్నికల రిటర్నింగ్ అధికారులు సర్పంచ్, వార్డులకు బరిలో ఉన్న అభ్యర్థులకు గుర్తులను కేటాయించారు.

భగత్‌నగర్: కొత్తపల్లి మండలంలో ఆరు గ్రామాల్లో 8 మంది సర్పంచ్ అభ్యర్థులు 17 మంది వార్డు సభ్యులు నామినేషన్లు ఉపసంహరించుకున్నారు. సర్పంచ్ స్థానాలకు పోటీ నెలకొనగా, ఎనిమిది వార్డులు ఏకగ్రీవమయ్యాయి. ఆసిఫ్‌నగర్ 2, 4, 8వ, బద్దిపల్లి 6, ఖాజీపూర్ 5వ, 8వ, నాగుల మల్యాల 4వ, ఎలగందల్ 2వ వార్డు ఏకగ్రీమయ్యాయి. ఎలగందల్ రెండో వార్డులో వయస్సు తక్కువ కారణంగా నామినేషన్‌ను తిరస్కరించడంతో ఒకరే అభ్యర్థి మిగలగా ఏకగ్రీవమైనట్లు ప్రకటించారు. ఆసిఫ్‌నగర్ సర్పంచ్ 5, వార్డు 28 మంది, బద్దిపల్లి సర్పంచ్ 6, వార్డు 18, ఎలగందల్ సర్పంచ్ 5, వార్డు 29, కమాన్‌పూర్ సర్పంచ్ 5, వార్డు 43, ఖాజీపూర్ సర్పంచ్ 5, వార్డు 16, నాగుల మల్యాల సర్పంచ్ 4, వార్డు 24 మంది పోటీ పడుతున్నారు. కొత్తపల్లి మండల వ్యాప్తంగా మొత్తం సర్పంచులకు 30 మంది, వార్డులకు 158 మంది బరిలో ఉన్నారు.

చొప్పదండి: చొప్పదండి మండలంలో 16 గ్రామాలకు దేశాయిపేట సర్పంచ్‌గా వడ్లకొండ తిరుమల, పెద్దకుర్మపల్లి సర్పంచ్‌గా మావురం సుగుణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 68 మంది బరిలో ఉన్నారు. 154 వార్డు స్థానాలకు 53 ఏకగ్రీవమయ్యాయి. మిగతా చోట్ల 240 మంది బరిలో నిలిచారు. సర్పంచ్ ఆర్నకొండ 12, మంగళపల్లి 4, రాగంపేట 6, కోనేరుపల్లి 3, గుమ్లాపూర్ 7, చాకుంట 3, కొలిమికుంట 4, సాంబయ్యపల్లి 7, భూపాలపట్నం 4, వెదురుగట్ట 3, చిట్యాలపల్లి 2, రుక్మాపూర్ 2, కాట్నపల్లి 3, రేవెల్లి ఆరుగురు బరిలో ఉన్నారు.

- కాట్నపల్లిలో సీనియర్ న్యాయ వాది రామగిరి శ్రీనివాస్ వార్డు సభ్యుడిగా ఏకగ్రీవమయ్యారు.

రెండో విడత పరిశీలన

తిమ్మాపూర్: తిమ్మాపూర్ మండలంలో రెండో విడత పంచాయతీ ఎన్నికల్లో భాగంగా నామినేషన్ల పరిశీలన చేపట్టారు. మంగళవారం 23 సర్పంచ్ స్థానాలకు 180, 212 వార్డు స్థానాలకు 690 నామినేషన్లు వచ్చాయి. బుధవారం పరిశీలన అనంతరం 23 సర్పంచ్ స్థానాలకు 114, 212 వార్డులకు 589 నామినేషన్లు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఒక్క నామినేషన్ కూడా తిరస్కరణకు గురికాలేదు. లక్ష్మీదేవిపల్లి సర్పంచ్ స్థానానికి 3 నామినేషన్లు, మహత్మానగర్ 8, రామకృష్ణకాలనీ 6, తిమ్మాపూర్ 7, బాలయ్య పల్లి 9, గొల్లపల్లి 3, ఇందిరానగర్ 5, జుగుండ్ల 3, కొత్తపల్లి 6, మల్లాపూర్ 5, మన్నెంపల్లి 5, మొగిళిపాలెం 5, నల్లగొండ 5, నర్సింగాపూర్ 4, నేదునూర్ 3, నుస్తులాపూర్ 3, పర్లపల్లి 5, పొలంపల్లి 3, పోరండ్ల 10, రాంహనుమాన్ నగర్ 4, రేణికుంట 4, వచ్చునూర్ 3 మొత్తం 114 నామినేషన్లు వచ్చాయి.

- నామినేషన్ల పరిశీలన అనంతరం 212 వార్డులకు 589వార్డు సభ్యుల నామినేషన్లు ఉన్నట్లు తేలింది. ఇందులో 24 స్థానాలు ఏకగ్రీవమయ్యే అవకాశం కనిపిస్తోంది.

మానకొండూర్: మానకొండూర్ మండలంలో 29 సర్పంచ్ స్థానాలకు 202, 280 వార్డులకు 822 నామినేషన్లు దాఖలయ్యాయి. పరిశీలనలో మండలంలోని పెద్దూరుపల్లి రెండో వార్డులో రాకేష్ నామినేషన్ తిరస్కరణకు గురైనట్లు ఎంపీడీవో వరలక్ష్మీ తెలిపారు. సర్పంచ్ బరిలో 202, వార్డు సభ్యుల స్థానాల్లో 821 మంది బరిలో ఉన్నారు.

గన్నేరువరం: మండలంలో 17 గ్రామాల సర్పంచ్ స్థానాలకు 133 నామినేన్లకు 48 తిరస్కరించగా 85 ఖరారయ్యాయి. మండలంలోని 140 వార్డు స్థానాలకు 335 నామినేషన్లకు 31 తిరస్కరించారు. 304 నామినేషన్‌లు ఖరారైనట్లు ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. సర్పంచ్ స్థానాలు గన్నేరువరం 12, గునుకుల కొండాపూర్ 8, గుండ్లపల్లి ఎక్స్ రోడ్ 5, చీమలకుంటపల్లి 3, జంగపల్లి 4, మైలారం 3, ఖాసింపేట 6, మాదాపూర్ 4, చొక్కారావుపల్లి 4, యాస్వాడ 6, చాకలివానిపల్లి 5, గుండ్లపల్లి 4, హన్మాజిపల్లి 9, సాంబయపల్లి 5, గోపాల్‌పూర్ 3, పారువెల్ల 3, పీచుపల్లి 1, 38 వార్డు స్థానాలకు ఒక్కొక్క నామినేషన్ మాత్రమే దాఖలైనట్లు ఎంపీడీవో తెలిపారు. పీచుపల్లిలో సర్పంచ్ స్థానానికి ఒక్కటే నామినేషన్ వేయడంతోపాటు 6 వార్డులకు సింగిల్ నామినేషన్ రావడంతో ఏకగ్రీవమైంది.

చిగురుమామిడి: మండలంలోని 17 గ్రామాలకు 147 సర్పంచ్ అభ్యర్థులు నామినేషన్లు వేశారు. ఇందులో 50 తిరస్కరణకు గురవగా 97 ఖారారైనట్లు ఎంపీడీవో విజయ్‌కుమార్ తెలిపారు. 561 మంది వార్డు సభ్యుల్లో 65 తిరస్కరించగా 496 మంది నామినేషన్లు ఖరారయ్యాయి.

తొలి విడతలో ముగ్గురు ఏకగ్రీవం

(5వ పేజీ తరువాయి)

కాగా మిగతా 101 వార్డులకు 240 మంది పోటీలో ఉన్నారు. కరీంనగర్ రూరల్ మండలంలో 14 పంచాయతీలలో సర్పంచు పదవులకు 57 మంది బరిలో ఉన్నారు. 132 వార్డులకు 32 వార్డుల్లో సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 100 వార్డులకు 246 మంది పోటీపడుతున్నారు. రామడుగు మండలంలోని 23 గ్రామపంచాయతీల్లోని 23 సర్పంచు స్థానాల్లో ఒకటి ఏకగ్రీవం కాగా మిగిలిన 22 సర్పంచు స్థానాల్లో 94 మంది పోటీలో ఉన్నారు. 222 వార్డుల్లోని 81 వార్డులు ఏకగ్రీవంగా కాగా, మిగిలిన 141 వార్డుల్లో 354 మంది పోటీలో ఉన్నారు. కొత్తపల్లి మండలంలోని 6 గ్రామపంచాయతీల్లోని ఆరు సర్పంచు స్థానాలకు 30 మంది పోటీలో ఉండగా, 62 వార్డుల్లో 8 వార్డుల సభ్యులు ఏకగ్రీవం అయ్యాయి. మిగిలిన 54 వార్డుల్లో 158 మంది పోటీలో ఉన్నారు.

● రెండవ విడత నామినేషన్ల పరిశీలన పూర్తి :

రెండవ విడత ఎన్నికలు జరిగే గ్రామపంచాయతీల్లో సర్పంచు, వార్డుసభ్యుల నామినేషన్ల పరిశీలన బుధవారం పూర్తయింది. తిమ్మాపూర్, మానకొండూర్, చిగురుమామిడి, గన్నేరువరం, శంకరపట్నం గ్రామపంచాయతీల్లో నామినేషన్ల పరిశీలన అనంతరం 113 సర్పంచు స్థానాలకు 724 మంది, 1046 వార్డులకు 2858 మంది పోటీలో ఉన్నారు. తిమ్మాపూర్ మండలంలోని 23 సర్పంచు పదవులకు 114 మంది, 212 వార్డుసభ్యుల పదవులకు 589 మంది, మానకొండూర్ మండలంలోని 29 సర్పంచు పదవులకు 202 మంది, 280 వార్డు పదవులకు 821 నామినేషన్లు దాఖలయ్యాయి. చిగురుమామిడి మండలంలోని 17 సర్పంచు పదవులకు 97, 174 వార్డు పదవులకు 496, గన్నేరువరం మండలంలోని 17 సర్పంచు పదవులకు 85 నామినేషన్లు, 140 వార్డులకు 304 నామినేషన్లు, శంకరపట్నం మండలంలోని 27 సర్పంచు పదవులకు 226 నామినేషన్లు, 240 వార్డు పదవులకు 648 నామినేషన్లు వచ్చాయి. గురువారం అభ్యంతరాలేమైనా ఉంటే అప్పీలు చేసుకునే అవకాశం ఉంది. శుక్రవారం అభ్యంతరాలను పరిశీలించి పరిష్కరిస్తారు. శనివారం నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంది. ఉపసంహరణ అనంతరం బరిలో ఉన్న అభ్యర్థుల పేర్లను ప్రకటించి గుర్తులను కేటాయిస్తారు.

ట్రినిటీలో ప్రపంచ నేల దినోత్సవం

కరీంనగర్ టౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): నగరంలోని సాలెహ్‌నగర్ ట్రినిటీ ది స్కూల్ ఆఫ్ లెర్నింగ్ స్కూల్‌లో బుధవారం ప్రపంచ నేల దినోత్సవం సందర్భంగా ప్లాంటింగ్ సాప్లింగ్స్ గ్రీన్ డే నిర్వహించారు. విద్యార్థులు మొక్కల పెంపకం, సంరక్షణ ప్రాముఖ్యతపై అవగాహన పోస్టర్లను ప్రదర్శించారు. ట్రినిటీ చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ మమతారెడ్డి, ప్రిన్సిపాల్ రత్నమాల, అకాడమిక్ కో ఆర్డినేటర్ ఎన్.శ్రీకాంత్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి విజ్ఞాన్ మంతన్‌కు సెయింట్ జార్జ్ విద్యార్థులు

భగత్‌నగర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి విజ్ఞాన్ మంతన్ పోటీలకు సెయింట్ జార్జ్ (సీబీఎస్‌ఈ) విద్యార్థులు ఎంపికయ్యారు. బుధవారం పాఠశాల ఆవరణలో విద్యార్థులను విద్యాసంస్థల చైర్మ న్ డాక్టర్ ఫాతిమారెడ్డి అభి నందించారు. విద్యార్థులు పి.ఖుషి, ఎం. విశాల్‌పటేల్, గగన్ గౌతమ్ ఎంపికైనట్లు చెప్పారు.

పీచుపల్లి గ్రామాభివృద్ధికి రూ.10 లక్షలు

కరీంనగర్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి, ప్రతినిధి): చిగురుమామిడి మండలం పీచుపల్లి గ్రామాభివృద్ధికి పది లక్షల రూపాయలు కేటాయిస్తానని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ ప్రకటించారు. బీజేపీ బలపర్చిన అభ్యర్థులు ఏకగ్రీవమైతే పది లక్షలు అందిస్తానని ఇప్పటికే హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో పీచుపల్లిలో బీజేపీ బలపర్చిన అభ్యర్థి సామ రాజిరెడ్డి ఒక్కరే నామినేషన్ వేయడంతో ఎన్నిక ఏకగ్రీవం కానున్నది. రాష్ట్ర ప్రభుత్వం సైతం ఏకగ్రీవమయ్యే గ్రామాలకు పది లక్షలు ప్రోత్సాహక నిధులు ఇస్తామని ప్రకటించిండంతో మొత్తం రూ.20 లక్షలు అందనున్నాయి.

జాతీయస్థాయిలో ప్రతిభ చాటేలా ప్రోత్సహించాలి

కరీంనగర్ టౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో రాణించిన అల్ఫోర్స్ విద్యార్థులను జాతీయ స్థాయిలో ప్రతిభచాటే విధంగా ప్రోత్సహించాలని డీఈవో శ్రీరాంమొండయ్య సూచించారు. బుధవారం రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికైన ఆల్ఫోర్స్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ విద్యార్థులను, విద్యాసంస్థల అధినేత వి.నరేందర్‌రెడ్డితో కలిసి అభినందించారు.

రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీల ఫలితాలు విడుదల

కరీంనగర్ టౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): నగరలోని కోట జూనియర్ కళాశాలలో నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల ఫలితాలను ప్రజ్ఞా వికాస్ రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి శేఖర్‌రావు, కోట జూనియర్ కళాశాల చైర్మన్ డాక్టర్ డి.అంజిరెడ్డి విడుదల చేశారు. ప్రతిభ కనబరిచిన నలుగురు రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు తెలిపారు. సరస్వతి శిశుమందిర్ విద్యార్థి బి.సాయిశ్రేష్ట ప్రథమ, వెలిచాలకు చెందిన నెట్టు సంజన ద్వితీయ, వక్తృత్వ పోటీల్లో పారమిత విద్యార్థి ఎ.సినీతిక ప్రథమ, ఆసీఫ్‌నగర్ జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థి డి.లక్ష్మిశ్లోక ద్వితీయ స్థానంలో నిలిచినట్లు చెప్పారు. వికాస్ తరంగిణి అధ్యక్షుగు గౌతమ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిన సర్పంచ్ అభ్యర్థి

భగత్‌నగర్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): బద్దిపల్లికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు, సర్పంచ్ అభ్యర్థి తాండ్ర రాజశేఖర్ బుధవారం బీజేపీలో చేరారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పొన్నం వెంకటరమణ, కుంట తిరుపతి, కడార్ల రతన్‌కుమార్, వేముల అనిల్, పోర్తి అనిల్, డాక్టర్ సునీల్ మంగళం, పోరెడ్డి నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పొన్నం అనిల్‌కు ఎమ్మెల్యే 'గంగుల' పరామర్శ

కరీంనగర్ టౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్, బీఆర్‌ఎస్‌వీ జిల్లా అధ్యక్షుడు పొన్నం అనిల్‌కుమార్ గౌడ్‌ను, కుటుంబసభ్యులు మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పరామర్శించారు. ఇటీవల అనిల్‌కుమార్‌గౌడ్ సోదరుడు పొన్నం శ్రీకాంత్‌గౌడ్ రోడ్డు ప్రమాదంలో మరణించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బుధవారం రేకుర్తిలోని పొన్నం అనిల్‌కుమార్ గౌడ్ నివాసంలో శ్రీకాంత్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, మాజీ కార్పొరేటర్లు ఉన్నారు.

వాగేశ్వరి అధ్యాపకుడికి డాక్టరేట్

తిమ్మాపూర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక వాగేశ్వరి కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్న జి.ఎస్.అరుణ్ కుమార్‌కు పంజాబ్‌లోని లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కళాశాల జనరల్ సెక్రెటరీ జి.శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఆయనతోపాటు జాయింట్ సెక్రెటరీ డి.శ్రీనివాస్ రెడ్డి, మెంబర్స్, ప్రిన్సిపాల్ అభినందించారు.

జాతీయ రంగోత్సవ పోటీల్లో సురభి విద్యార్థులకు పతకాలు

గంగాధర, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రంగోత్సవ పోటీల్లో గంగాధర మండలం సురభి పాఠశాల విద్యార్థులు పతకాలు సాధించినట్లు కరస్పాండెంట్ వీరేశం తెలిపారు. పాఠశాలకు చెందిన 222 మంది విద్యార్థుల్లో 59 మంది గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ మెడల్స్ సాధించారని పేర్కొన్నారు. పాఠశాల డైరెక్టర్ నర్సయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన సర్పంచ్ అభ్యర్థి

భగత్‌నగర్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలం ఖాజీపూర్ సర్పచ్ అభ్యర్థి, బీఆర్‌ఎస్ నాయకుడు సోమినేని తిరుపతి కాంగ్రెస్‌లో చేరారు. బుధవారం పార్టీ పార్లమెంట్ నియోజక వర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు కండువా కప్పి ఆహ్వానించారు.

ఘనంగా న్యాయవాదుల దినోత్సవం

భగత్‌నగర్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): న్యాయవాదుల దినోత్సవం సందర్భంగా నగరంలోని రాజరాజేశ్వరి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కోర్టు భవనంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్లను సన్మానించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు నరహరి లక్ష్మారెడ్డి, సీనియర్ లయన్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రముఖ న్యాయవాది బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డిని జిల్లా పార్టీ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు.

● సంక్షిప్తంగా..

కరీంనగర్ టౌన్: నగరంలోని ఎనిమిది ప్రభుత్వ పాఠశాలల్లో 375 మంది పదోతరగతి విద్యార్థులకు హుజూరాబాద్ గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్టు నిర్వాహకులు గంగిశెట్టి జగదీశ్వర్ పరీక్షా ప్యాడ్‌లను పంపిణీ చేశారు.

భగత్‌నగర్: రేకుర్తిలో న్యాయ పరమైన ఇళ్లకు ఇంటి నంబర్లు కేటాయించాలని రేకుర్తి మాజీ సర్పంచ్ నందెల్లి ప్రకాశ్ అధికారులకు విజ్ఞప్తి చేశారు.

సుభాష్‌నగర్: ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు కుతాడి శివరాజ్ డిమాండ్ చేశారు. బుధవారం నగరంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు.

సుభాష్‌నగర్: కరీంగనర్‌లోని మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో స్థానిక భగత్‌నగర్‌లోని సన్‌రైజ్ అపార్ట్‌మెంట్‌లో బుధవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఆస్పత్రి వైద్యుడు డాక్టర్ ప్రకాశ్ పరీక్షలు నిర్వహించారు. ఆస్పత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్, మార్కెటింగ్ మేనేజర్ కోట కరుణాకర్, చంద్ర శేఖర్, కోఆర్డినేటర్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

కరీంనగర రూరల్: నగరంలోని 34వ డివిజన్ బిమ్మకల్‌లో రేషన్ బియ్యం తీసుకున్న లబ్ధిదారుల సౌకర్యార్థం ఎంఐఎం డివిజన్ అధ్యక్షుడు మహ్మద్ ఖాజా మజా రుద్దీన్ ఆధ్వర్యంలో ఉచితంగా ఆటోలను ఏర్పాటు చేయగా పార్టీ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ ప్రారంభించారు.

సుభాష్‌నగర్: నగరంలోని సీఎస్ఐ మిషన్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆశ్రయం హ్యాండ్ ఆఫ్ హోప్, అమెరికాకు చెందిన డాక్టర్ బొబ్బిలి దివాకర్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు.

కరీంనగర్ కల్చరల్: నగరంలోని మార్కెట్‌రోడ్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో 2027 వరకు కొబ్బరి కాయలు, వాహన, పూజా సామగ్రి విక్రయానికి ఈ నెల 6న మధ్యాహ్నం 12 గంటలకు వేలం నిర్వహించనున్నట్లు ఈవో కందుల సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు.

కరీంనగర్ కల్చరల్: నగరంలోని రేకుర్తి సమ్మక్క సారలమ్మ జాతరలో పలు హక్కులకు ఈ నెల 12 వేలం నిర్వహించనున్నట్లు జాతర ఈవో మారుతి ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గలవారు 9441641455 నంబరులో సంప్రదించాలని ససూచించారు.

కరీంనగర్ క్రైం: సీఎం రేవంత్‌రెడ్డి హుస్నాబాద్ పర్యటన సందర్భంగా బీసీ సంఘాల నాయకులు, దళిత సంఘాల నాయకులను బుధవారం ఉదయం పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. సాయంత్రం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. బీసీ సంఘం నాయకుడు ఆది మల్లేశంను కరీంనగర్ త్రీటౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

కరీంనగర్ క్రైం: సీఎం పర్యటన నేపథ్యంలో కరీంనగర్ జిల్లా పోరాట సమితి నాయకులను ముందస్తు అరెస్టు చేయడంపై నిరసన తెలుపుతున్నామని సమితి నాయకులు మానాల రవి, దోనె వెంకటేశ్వర్‌రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

చొప్పదండి: పట్టణంలోని వేంకటేశ్వర మణికంఠ అయ్యప్ప ఆలయం నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. గౌరవాధ్యక్షులుగా వేంసాని రవీందర్ యాదవ్, గొల్లపల్లి శ్రావణ్ కుమార్, అధ్యక్షులుగా పొన్నం రాజేశ్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా శివారెడ్డి, ఉపాధ్యక్షులుగా వెల్మ విజేందర్‌రెడ్డి, సత్య నారాయణ, వెంకన్న, రాజు, కోశాధికారిగా మల్లేశం తదితరులను ఎన్నుకున్నారు.

ఘనంగా దివ్యాంగుల దినోత్సవం

భగత్‌నగర్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. ఎంఈవో ఆనందం, ప్రధానోపాధ్యాయుడు కన్నం రమేష్ పాల్గొన్నారు.

కరీంనగర్ రూరల్: బొమ్మకల్ ప్రాథమిక పాఠశాలలో ఎంఈవో వాసవి, సెక్టోరియల్ అధికారి ఆంజనేయులు, హెచ్‌ఎం శ్రీనివాస్ పాల్గొన్నారు.

చొప్పదండి: చొప్పదండి భవిత కేంద్రంలో దివ్యాంగులకు క్రీడా పోటీలను నిర్వహించారు. ఎంఈవో మోహన్, మున్సిపల్ కమిషనర్ కీర్తి నాగరాజు పాల్గొన్నారు.

మానకొండూర్: మానకొండూర్‌లో భవిత కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ విజయ్‌కుమార్, సీఐ సంజీవ్, ఎంఈవో మధుసూదనాచారి, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, జ్యోతి, జీవన్‌రెడ్డి పాల్గొన్నారు.

గంగాధర: ఒద్యారం జడ్పీహెచ్ పాఠశాలలో ఎంఈవో ప్రభాకర్‌రావు మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు పిల్లలో ఆత్మవిశ్వాసం పెంచుతా యన్నారు.

హుజూరాబాద్‌లో..

హుజూరాబాద్: పట్టణంలోని భవిత వనరుల కేంద్రంలో ఎంఈవో శ్రీనివాస్ మాట్లాడుతూ దివ్యాంగుల హక్కులను, ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వీణవంక: మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఎంఈవో శోభరాణి, ప్రధాన ఉపాధ్యాయుడు అశోక్ రెడ్డి పాల్గొన్నారు.

ఇల్లందకుంట :తహసీల్దార్ రాజమల్లు ఆధ్వర్యంలో కార్యాల యంలో సీనియర్ సహాయకులుగా విధులు నిర్వహి స్తున్న అనిల్‌ను సన్మానించారు.

'కిమ్స్'లో కేక్ మిక్సింగ్ వేడుక


కార్యక్రమంలో మాట్లాడుతున్న అడిషనల్ డీసీపీ వెంకటరమణ

కరీంనగర్ టౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కిమ్స్ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాలలో బుధవారం కేక్ మిక్సింగ్ వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు డీసీపీ వెంకటరమణ మాట్లాడుతూ ప్రపంచ టూరిజంలో హోటల్ రంగం అధిక ప్రాధాన్యం సంతరించుకుందన్నారు. విశిష్ట అతిథి, కిమ్స్ వైస్ చైర్మన్ సాకేత్‌రామారావు కేక్ తయారీ విధానంలో అవసరమయ్యే వివిధ డ్రై ఫ్రూట్స్, ఆల్కహాల్, ఇతర వస్తువులతో కేక్ తయారు చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌లు గౌతమ్, అర్జున్‌రావు, ఫ్యాకల్టీ సాయిబాలు, హరీష్, రాంకిశోర్, సతీష్, కృష్ణవేణి, జితేందర్, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు అల్ఫోర్స్ విద్యార్థులు

భగత్‌నగర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు అల్ఫోర్స్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ విద్యార్థులు ఎంపికయ్యారు. బుధవారం కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఈ-టెక్నో పాఠశాలలో విద్యార్థులను విద్యాసంస్థల అధినేత డాక్టర్ డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా ఆయ న మాట్లాడుతూ విద్యార్థులకు వైజ్ఞానిక శాస్త్రంపై అవగాహన కల్పించి సంపూర్ణ సమాచారం అందిస్తే నూతన అవిష్కరణలను రూపొందిస్తారన్నారు.


విద్యార్థులను అభినందిస్తున్న అల్ఫోర్స్ చైర్మన్ డాక్టర్ నరేందర్‌రెడ్డి

న్యాయవాదులను కలిసిన విద్యార్థులు

జాతీయ న్యాయవాదుల దినోత్సవం సందర్భంగా కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఈ-టెక్నో విద్యార్థులు కోర్టు సముదాయంలో న్యాయవాదులను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రణవ్ సేవలు భేష్

హుజూరాబాద్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ పార్టీకి చేస్తున్న సేవలు భేష్‌గా ఉన్నాయని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. బుధవారం హుస్నాబాద్ నియోజకవర్గంలో సీఎంను ప్రణవ్ మర్యాదపూర్వకంగా కలిశారు. హుజూరాబాద్ నియోజకవర్గంలో పార్టీ కోసం ప్రణవ్ తీవ్రంగా కృషి చేస్తున్నారని సీఎం అన్నారు. రానున్న రోజుల్లో మరింత బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు.

సీఎం వ్యాఖ్యలు సరికాదు

కరీంనగర్ టౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హిందూ దేవతలను కించపరుస్తూ వాఖ్యలు చేయడం భావ్యం కాదని బీజేపీ నాయకుడు, మాజీ మేయర్ యాదగిరి సునీల్‌రావు ఒక ప్రకటనలో ఖండించారు. వెంటనే తన వాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

భగత్‌నగర్: హిందూ దేవాలయాలపై ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలకు నిరసనగా బీజేపీ పశ్చిమ జోన్ కన్వీనర్ జాడి బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో వివేకానంద జంక్షన్‌లో ధర్నా నిర్వహించారు.

సీఎంను కలిసిన దేశిని కోటి

జమ్మికుంట: సీఎం రేవంత్‌రెడ్డిని జమ్మికుంటకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దేశిని కోటి, రాష్ట్ర ఎస్సీ సెల్ మాజీ కో-కన్వీనర్ దొంత రమేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు ముఖ్యమంత్రిని సన్మానించారు.

సంస్కృతీసంప్రదాయాలను కాపాడుకోవాలి


మాట్లాడుతున్న అహోబిల రామానుజ జీయరుస్వామి

కరీంనగర్ కల్చరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): భారతీయ సంస్కృతీ సాంప్రదాయాలను కాపాడుకుంటూ భావి తరాలకు అందించాలని త్రిదండి అహోబిల రామానుజ జీయరుస్వామి అన్నారు. గీతా జయంతి సందర్భంగా ఇటీవల జెట్, వికాస తరంగిణి, కరీంనగర్ ప్రజ్ఞ విభాగం ఆధ్వర్యంలో భగవద్గీత 12వ అధ్యాయంపై వివిధ పాఠశాలల విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. బుధవారం వేదభవనంలో నగదు బహుమతులను అందజేశారు. గీతాసారాన్ని అర్థం చేసుకొని అందులోని విలువలను పాటించాలన్నారు. ప్రజ్ఞ విభాగ రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి శేఖర్‌రావు, కోట అంజిరెడ్డి, శ్రీదేవి, యాద కిషన్, అరుణ, అంజనేయస్వామి, గౌతమరావు, అశోకరావు, వెంకటేశం పాల్గొన్నారు.

శ్లోక పోటీల్లో శ్రావణ్, శ్రీమేధ, మిహిర, దీవెన, భావ పోటీలో సుస్వర మౌనిక, అక్షిత, ప్రణవి, ఆనంద్, వక్తృత్వంలో సీయ, సీహెచ్ మౌనిక, చిత్రలేఖనం ధృవాన్, శ్రీనితు, శ్రీనిత, లౌక్య, ఉపన్యాసం శివసాయికృష్ణ, ఆయుష్మ, వైష్ణవి, వ్యాసరచన శరణ్య, అర్పిష్మ, సూర్యకుమార్

మూడో విడత నామినేషన్లు ప్రారంభం

హుజూరాబాద్ రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలో 20 గ్రామాల్లో సర్పంచ్, వార్డు స్థానాలకు నామినేషన్‌ల స్వీకరణ బుధవారం ప్రారంభమైంది. సర్పంచులకు 26, 196 వార్డులకు 73 నామినేషన్లు వచ్చినట్లు మండల పరిషత్ అధికారి సునీత తెలిపారు. సింగాపూర్‌లోని నామినేషన్ కేంద్రాన్ని జిల్లా ఎన్నికల అబ్జర్వర్ వెంకటేశ్వర్లు పరిశీలించారు.

వీణవంక: మండలంలోని 26 గ్రామాలకు 25 మంది సర్పంచ్, 44 మంది వార్డులకు నామినేషన్లు వేశారు. చల్లూరు సర్పంచ్ 3, వార్డు 7, ఎల్బాక సర్పంచ్ 1, వార్డు 4, మామిడాలపల్లి సర్పంచ్ 2 వార్డు 12, బొంతుపల్లి సర్పంచ్ 1, కొండపాక సర్పంచ్ 1,వార్డు 3, హిమ్మత్‌నగర్ సర్పంచ్ 2, వార్డు 2, శ్రీరాములపేట 1, మల్లారెడ్డిపల్లి సర్పంచ్ 3, వార్డు 4, మల్లన్నపల్లి వార్డు 2, బ్రాహ్మణపల్లి వార్డు 1, నర్సింగాపూర్ సర్పంచ్ 1, కనపర్తి సర్పంచ్ 1, వార్డు 1, బేతిగల్ సర్పంచ్ 2, వల్బాపూర్ సర్పంచ్ 1, వీణవంక సర్పంచ్ 1, వార్డు 2, రామకృష్ణాపూర్ సర్పంచ్ 4, వార్డు 1, లస్మక్కపల్లి సర్పంచ్ 1, వార్డు 5 చొప్పున నామినేషన్‌లు వచ్చాయి.

ఇల్లందకుంట : మండలంలోని అన్ని గ్రామాల్లో 5 క్లస్టర్లకు 22మంది సర్పంచ్, 30మంది వార్డు స్థానాలకు నామినేషన్లు దాఖలు చేశారు. ఇందులో సర్పంచులకు పాతర్లపల్లి నుంచి బైరెడ్డి రాజిరెడ్డి, చల్లూరి ప్రభాకర్, కొడారి అయ్యన్న, అబ్బిడి సురేందర్‌రెడ్డి, శ్రీరాముల రమేష్, వంతడుపుల నుంచి మంద వనిత, మల్లన్నపల్లె నుంచి మహేందర్, మర్రివానిపల్లె నుంచి పైండ్ల తిరుపతిరెడ్డి, కళ్లెం తిరుపతిరెడ్డి, బోగంపాడు నుంచి సామ లావణ్య, ఎలేటి నిర్మల, బద్దం శిరీష, ఇల్లందకుంట నుంచి దార సురేష్, 30 వార్డులకు నామినేషన్లు వేశారు.

మండలంలోని హిమ్మత్‌నగర్ సర్పంచ్‌గా బీఆర్‌ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ తండ్రి గెల్లు మల్లయ్య నామినేషన్ వేయగా బేతిగల్ గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా బీఎస్‌సీ అగ్రి కల్చర్ చేసి ఉద్యోగం చేస్తున్న హరి చందన విజయ్ దాఖలు చేశారు.

వల్బాపూర్, వీణవంక నామినేషన్ కేంద్రాలను రాష్ట్ర ఎన్నికల పరిశీలకుడు వెంకటేశ్వర్లు పరిశీలించారు. బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఏసీపీ మాధవి వివరించారు. నామినేషన్ అభ్యర్థులకు అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు చేసినట్లు ఎంపీడీవో శ్రీధర్ తెలిపారు.

సైదాపూర్: మండలంలో 27 సర్పంచ్ స్థానాలకు 27, 238 వార్డులకు 48 నామినేషన్లు వచ్చినట్లు ఎంపీడీవో యాదగిరి తెలిపారు.

జమ్మికుంట: మండలంలోని 20గ్రామాల పరిధిలోని 188వార్డు స్థానాలు ఉన్నాయి. మడిపల్లి, మాచనపల్లి, కోరపల్లి, బిజిగిరిషరీఫ్, తనుగుల, వావిలాలను క్లస్టర్లుగా ఏర్పాటు చేశారు. సర్పంచ్ మాచనపల్లి 1, పెద్దంపల్లి 2, జగ్గయ్యపల్లి 3, కోరపల్లి 1, సైదాబాద్ 4, వెంకటేశ్వర్లపల్లి 2, బిజిగిరిషరీఫ్ 1, మొత్తం 20 నామినేషన్లు వేశారు. మండలంలోని 188వార్డుల్లో 71నామినేషన్లు వచ్చాయి.